Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 266 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)



శుక్రవారం, 5 - 6 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు రష్యాలో మంత్రి నారా లోకేష్

**- స్బేర్ బ్యాంక్ గిగావాట్ ఎల్ఎల్ఎం సేవలను భారత్‌లో విస్తరించండి - యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్ కోసం సాంకేతిక సహకారం అందించండి**

**- ఏపిలో ఫార్మా, అగ్రి ఎక్స్ పోర్టర్లకు వ్యవస్థీకృత రుణాలు అందించండి - స్బేర్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ అల్బర్ట్ యెఫిమోవ్‌తో మంత్రి లోకేష్ భేటీ**



**మాస్కో:** రష్యా ప్రభుత్వ నియంత్రిత ప్రముఖ రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మాస్కోలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... "వెస్టన్ ప్లాట్ ఫాంలకు సురక్షితమైన లోకలైజ్డ్ జనరేటివ్ ఎఐ ప్రత్యామ్నాయ వ్యవస్థను అందించిన తరహాలోనే భారతదేశంలో బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు స్బేర్ బ్యాంక్ గిగాచాట్ ఎల్ఎల్ఎం ను విస్తరించండి. జాతీయ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ నెట్‌వర్క్ భద్రతను పటిష్టం చేస్తూ, స్బేర్‌బ్యాంక్ యొక్క అడ్వాన్స్డ్ వాయిస్ రికగ్నిషన్ & బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారతదేశ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లో ఇంటిగ్రేట్ చేసేలా సాంకేతిక సహకారం అందించండి. భారత్‌లో పెద్దఎత్తున మున్సిపల్ కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్, డిజిటల్ సేఫ్టీ సిస్టమ్‌లను విస్తరించండి. ప్రపంచస్థాయి సాఫ్ట్ వేర్, ఎఐ ఇంజనీర్లకు వేగంగా శిక్షణ ఇవ్వడానికి, స్బేర్ బ్యాంక్ యొక్క గేమిఫైడ్, పీర్-టు-పీర్ "స్కూల్ 21" కోడింగ్ అకాడమీలను భారతదేశంలోని ప్రధాన విద్యా కేంద్రాలలో ఏర్పాటు చేయండి. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం దూరప్రాంతాలకు రూపాయి- రూబుల్ వాణిజ్య అనుమతులు, వ్యవస్థీకృత రుణాలు అందించాలి" అని లోకేష్ విజ్ఞప్తి చేశారు. స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ స్పందిస్తూ... తమ బ్యాంక్ భారత్ లోని న్యూఢిల్లీ కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక కమర్షియల్ ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు, భారత్-రష్యా క్లయింట్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. బెంగళూరులోని తమ ఐటీ హబ్ సరిహద్దు వాణిజ్య పరిష్కారాలు, రూపాయి-రూబుల్ యంత్రాంగాలకు సమన్వయ కేంద్రంగా పనిచేస్తుంది. న్యూఢిల్లీ, ముంబైలోని శాఖలు వ్యూహాత్మక వాణిజ్య కారిడార్లలో మౌలిక సదుపాయాల పెట్టుబడికి గేట్ వేలుగా పనిచేస్తున్నాయని తెలిపారు. కీలక వాణిజ్య డెస్క్‌ల ట్రెజరీ కార్యకలాపాలు, కార్పొరేట్ రుణాల మంజూరు, ఎంటర్‌ప్రైజ్ క్లయింట్ల కోసం ఏఐ-ఆధారిత డేటా విశ్లేషణలను నిర్వహిస్తున్నామని అన్నారు. స్బేర్ బ్యాంక్ గ్లోబల్ బ్యాంకింగ్ నెట్ వర్క్ ద్వారా మాసివ్ లిక్విడిటీ, అడ్వాన్స్డ్ డిజిటల్ సెక్యూరిటీ, ఇంటర్నేషనల్ ట్రేడ్ కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్నామని చెప్పారు. మంత్రి నారా లోకేష్ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

**స్బేర్ బ్యాంక్ గురించి...**

స్బేర్ బ్యాంక్ రిటైల్ బ్యాంకింగ్, క్లౌడ్ సేవలు, ఏఐ రంగాలకు విస్తరించిన, ప్రభుత్వ నియంత్రణలోని ఒక ప్రధాన బ్యాంకు. మాస్కో కేంద్ర కార్యాలయంగా పనిచేస్తున్న ఈ బ్యాంకు 110 మిలియన్లకు పైగా రిటైల్, 3.5 మిలియన్ల కార్పొరేట్ ఖాతాదారులను కలిగి ఉంది. ప్రపంచవ్యాప్తంగా 2.87లక్షలమంది ఉద్యోగులు కలిగిన ఈ బ్యాంకు 2025 ఆర్థిక సంవత్సరంలో 15.6 ట్రిలియన్ రూబుల్స్ (రూ.2.07లక్షల కోట్లు) ఆదాయాన్ని ఆర్జించింది. 12 వేల శాఖలు కలిగిన స్బేర్ బ్యాంక్ ప్రతిరోజూ 8కోట్లకు పైగా డిజిటల్ వినియోగదారులకు సేవలు అందిస్తోంది.

**భారత తూర్పు తీరంలో కెమికల్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణంలో భాగస్వామ్యం వహించండి. రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సిఇఓ ఇల్యా కోసిహ్ తో మంత్రి లోకేష్ భేటీ.**

మాస్కో: రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, డౌన్ స్ట్రీమ్ మిథనాల్ కెమికల్ ఇన్ ఫ్రా ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ కన్సార్షియమ్ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సిఇఓ ఇల్యా కోసిహ్, ఇంటర్నేషనల్ బిజినెస్ హెడ్ దర్యా అషానియాలతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మాస్కోలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ...భారత్ దిగుమతి చేసుకునే పెట్రో కెమికల్, స్పెషాలిటీ కెమికల్స్ ఫీడ్ స్టాక్‌లను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాసెస్ చేసేందుకు వీలుగా భారత తూర్పుతీరంలోని విశాఖ-కాకినాడ పిసిపిఐఆర్ (పెట్రోలియం, కెమికల్ అండ్ పెట్రో కెమికల్ ఇన్వెస్టిమెంట్ రీజియన్ - PCPIR) పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యాన ఒక అధునాతన ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణం చేపట్టండి. భారత పోర్టుల్లో బల్క్ కెమికల్ స్టోరేజి, పంపిణీ మౌలిక సదుపాయాలను అభివృద్ధి, ప్రత్యేకమైన వాటర్ ఫ్రంట్ బెర్త్‌ల నిర్మాణం, పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణంలో భాగస్వామ్యం వహించండి. రెడీ టు యూజ్ ప్లగ్ అండ్ ప్లే స్పేస్‌లు, సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుంటూ భారత్‌లో ఒక ప్రధాన కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్ & మెటీరియల్ సైన్స్ పరిశోధనా కేంద్రం (ఆర్ & డి సెంటర్) ఏర్పాటు చేయండి. రస్ కెమ్ ప్రొడక్షన్ టెక్నాలజీ ఉపయోగించి భారత్ లోని రెన్యువబుల్ ఎనర్జీ కారిడార్లను అనుసంధానిస్తూ... లో-కార్బన్ రసాయనాల మానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సిఇఓ ఇల్యా కోసిహ్ స్పందిస్తూ... రస్ కెమ్ కార్పొరేట్ ఫ్రేమ్ వర్క్ ద్వారా భారత్‌లో ప్రత్యేకమైన ఎస్ పివిలు, హోల్ సేల్ కెమికల్ డిస్ట్రిబ్యూషన్ మార్కెట్ లోకి ప్రవేశిస్తున్నట్లు చెప్పారు. ఇండస్ట్రియల్ పోర్టు ఫోలియో, మౌలిక సదుపాయాల కోసం ప్రీమియం రా మెటీరియల్స్, సాల్వెంట్స్, అడ్వాన్స్డ్ పాలిమర్ మాడిఫైర్లను అందిస్తుందని తెలిపారు. లోకలైజ్డ్ ట్రేడ్ స్ట్రాటజీలో భాగంగా హై వ్యాల్యూ కెమికల్ సప్లయ్ పెంచడానికి రస్ కెమ్ నియంత్రణలో పనిచేయడానికి ఆసక్తిచూపే సంస్థలతో కలిసి పని చేస్తుందని అన్నారు. ముంబై,

(మిగతా 2వ పేజీలో)

# వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్ర విముక్తికి రెండేళ్లు

**- విధ్వంసం...విద్వేషం...వినాశనం... ఇదే జగన్ ఐదేళ్ల పాలనకు నిర్వచనం - వైసీపీ ఫేక్ బుక్‌లెట్లతో నిజాలు మారవు - గొడ్డలి పోటు... వెన్నుపోటు... పేటెంట్ జగన్‌దే**

**- కేవలం 24 నెలల్లో అభివృద్ధి, సంక్షేమానికి కొత్త దిశ చూపిన కూటమి ప్రభుత్వం : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ రాక్షస పాలన నుంచి ఆంధ్రప్రదేశ్ విముక్తి పొంది రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీ అరాచక, విధ్వంసక రాజకీయాలకు చరమగీతం పాడారని, ప్రజల స్పష్టమైన తీర్పును అంగీకరించలేకనే వైసీపీ నాయకులు నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. వైసీపీ నిరసనలు ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించే చర్యలేనని అచ్చెన్నాయుడు అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారని, ప్రతిపక్షాల గొంతు నొక్కి, భయాందోళనల వాతావరణంలో పాలన సాగించారని మండిపడ్డారు. మహానాడు ఘన విజయాన్ని చూసి అసూయ, అక్కసు, ద్వేషంతో రగిలిపోతున్న వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి మరోసారి ఫేక్ బుక్‌లెట్ విడుదల చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని మంత్రి తీవ్రంగా ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేసి, ప్రజల జీవితాలను చీకట్లోకి నెట్టిన వ్యక్తి ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. జగన్ పాలన అంటే అభివృద్ధికి గొడ్డలి పోటు, ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు, రాష్ట్ర భవిష్యత్తుకు వినాశనం అని మండిపడ్డారు. జగన్ చరిత్ర మొత్తం చూస్తే గొడ్డలి పోటు, వెన్నుపోటుకు నిలువెత్తు నిర్వచనమని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. తన బాబాయి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అసలు నిందితులను కాపాడుతూ న్యాయాన్ని ఖూనీ చేసిన వ్యక్తి జగనేనన్నారు. తెలంగాణకు చెందిన శివకుమార్ స్థాపించిన పార్టీని కబ్జా చేసి తన సొంత పార్టీగా మార్చుకున్న వ్యక్తి జగనేనన్నారు. తల్లి, చెల్లికి సైతం న్యాయం చేయకుండా మహిళా ఆస్తి హక్కులకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌దేనని విమర్శించారు. తన అవలక్షణాలను ప్రత్యర్థులపై రుద్దడం, చెప్పిన అబద్ధాన్ని వందసార్లు చెప్పడం జగన్ రాజకీయ శైలిగా మారిందన్నారు.

**ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం చీకట్లోకి**

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో చట్టవ్యవస్థ, పరిపాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమయ్యాయని అచ్చెన్నాయుడు విమర్శించారు. అధికార మదంతో ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన పాలన చివరకు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో విధ్వంసం చేసిందన్నారు. అనాలోచిత నిర్ణయాలు, విచ్చలవిడి అప్పులతో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని, మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి నవ్యాంధ్రకు ఆశాకిరణమైన అమరావతిని నిర్వీర్యం చేశారని అన్నారు. రోడ్లను కనీసం మరమ్మతులు చేయకుండా రవాణా రంగాన్ని దెబ్బతీశారని, పారిశ్రామికవేత్తలను బెదిరింపులతో పొరుగు రాష్ట్రాలకు తరిమేశారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసం చేశారని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా రైతుల భూములకు అభద్రత సృష్టించారని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. రూ.1,600 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించకుండా అన్నదాతలను మోసం చేశారని అన్నారు. బటన్ నొక్కుతున్నామని ప్రచారం చేసుకుంటూ సంక్షేమ పథకాలపై అనేక ఆంక్షలు విధించి లక్షలాది మందిని లబ్ధికి దూరం చేశారని, తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.1.29 లక్షల కోట్ల భారం మోపారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయి, మాఫియాలకు కేంద్రంగా మార్చి యువత భవిష్యత్తును నాశనం చేశారని, శాంతి భద్రతలను పూర్తిగా దెబ్బతీశారని అన్నారు.




**నవరత్నాలు కాదు... నవ మోసాలు**

జగన్ పాదయాత్ర హామీలు, వైసీపీ మేనిఫెస్టో హామీలలో 85 శాతం అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. తల్లికి వందనం పథకం కింద హామీ ప్రకారం ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తున్న కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని చెప్పారు. అయితే ఇద్దరు పిల్లలకు అమ్మఒడి ఇస్తామని చెప్పి చివరకు ఒక్క బిడ్డకే పరిమితం చేసి వైసీపీ మోసం చేసిందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.14 వేలు, కేంద్రంతో కలిపి రూ.20 వేలు అందిస్తున్నామని, కానీ రైతు భరోసా పేరుతో జగన్ ఇచ్చిన హామీకి విరుద్ధంగా రాష్ట్ర నిధుల నుంచి కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చారని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా అమలు అవుతుంటే వైసీపీ పాలనలో ఆర్టీసీ ఛార్జీలు మూడుసార్లు పెంచారని గుర్తు చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని అన్నారు.

**యువతను మోసం చేసిన జగన్**

నిరుద్యోగ భృతి రద్దు చేసి యువతకు అన్యాయం చేసిన వ్యక్తి జగనేనని అచ్చెన్నాయుడు విమర్శించారు. మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదన్నారు. ఏపీపీఎస్సీని అవినీతిమయం చేశారని, పరిశ్రమలను తరిమివేసి ఉపాధి అవకాశాలను దెబ్బతీశారని ఆరోపించారు. రెండేళ్లలోనే లక్షలాది ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడిపిస్తోందన్నారు. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 24 లక్షల ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమం చేశామని చెప్పారు.

**సామాజిక న్యాయానికి తూట్లు పొడిచిన వైసీపీ**

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధుల్లో రూ.1.14 లక్షల కోట్లను దారి మళ్లించారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. పసుపు కుంకుమ, పెళ్లి కానుక వంటి పథకాలను రద్దు చేసి మహిళలకు అన్యాయం చేశారని అన్నారు. పెన్షన్ల విషయంలోనూ ప్రజలను మోసం చేశారని, సీఎం చంద్రబాబు నాయుడు ఒకేసారి పెన్షన్ పెంచితే జగన్ విడతలవారీగా పెంచి ప్రతి పెన్షన్‌దారుడికి వేల రూపాయల నష్టం కలిగించారని చెప్పారు. అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదల కడుపు కొట్టారని, మద్యనిషేధం హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు.

**నేరాలు, అరాచకాలకు ఐదేళ్లు**

వైసీపీ పాలనలో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు, విద్యార్థులు, దళితులు, రైతులు, వైద్యులు ఎవరూ రక్షణలో లేరని అచ్చెన్నాయుడు అన్నారు. ప్రజావేదిక విధ్వంసం నుంచి మొదలుకొని తెలుగుదేశం పార్టీ కార్యాలయాలపై దాడులు, దళిత యువకుల హత్యలు, వైద్యుల వేధింపులు, సోషల్ మీడియా పోస్టులకు కేసులు, అక్రమ అరెస్టులు, రాజకీయ కక్షసాధింపులు వరకూ రాష్ట్రాన్ని అరాచకానికి కేంద్రంగా మార్చారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడిని నిరాధార కేసులతో 53 రోజులు జైలులో పెట్టారని, కోడెల శివప్రసాద్ వంటి నాయకులను మానసికంగా వేధించి ప్రాణాలు తీసే పరిస్థితులు సృష్టించారని పేర్కొన్నారు.

**అధికారంలో లేకపోయినా విషప్రచారమే**

అధికారం కోల్పోయిన తర్వాత కూడా జగన్ తన వైఖరి మార్చుకోలేదని అచ్చెన్నాయుడు విమర్శించారు. అమరావతి నుంచి విశాఖ పెట్టుబడుల వరకు ప్రతి అభివృద్ధి కార్యక్రమంపై బురదజల్లడం ఆయన రాజకీయంగా మారిందన్నారు. పోలవరం, ఉచిత బస్సు ప్రయాణం, అమరావతి నిర్మాణం, పెట్టుబడులపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, దేవాలయాలు, రైతులు, మహిళలు, దళితులను రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

**జగన్ అబద్ధాలు నమ్మేంత అమాయకులు కాదు ఆంధ్రులు**

ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఫేక్ బుక్‌లెట్లు విడుదల చేస్తే నిజాలు మారవని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విధ్వంసం, విద్వేషం, దోపిడీ, అబద్ధాలు, నేరాలు, కక్షసాధింపులకు ప్రతిరూపమే జగన్ పాలన అని అన్నారు. గొడ్డలి పార్టీ ఐదేళ్ల చీకటి పాలన నుంచి ఆంధ్రప్రదేశ్‌ను కాపాడి, కేవలం 24 నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణ దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు రష్యాలో మంత్రి నారా లోకేష్

(మొదటి పేజీ తరువాయి)
కాన్పూరులోని కీలక పంపిణీ కేంద్రాలు అత్యధిక స్వచ్ఛత కలిగిన హెక్సామైన్, టైటానియం డయాక్సైడ్‌ను కర్మాగారాలకు చేరవేస్తాయని చెప్పారు. గ్లోబల్ ఎకోసిస్టమ్, ఖాతాదారులకు స్థిరమైన లార్జ్ స్కేల్ సప్లయ్ చైన్‌లకు హామీ ఇచ్చేందుకు భారత్ లోని భారీ పెట్రో కెమికల్ ప్లాంట్లను రస్ కెమ్ ఉపయోగించుకుంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని రీజనల్ సప్లయ్ నోడ్ కీలకమైన కెమికల్ కాంపొనెంట్లను విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, మ్యానుఫాక్చరింగ్ జోన్లకు చేరవేస్తుందని అన్నారు. మంత్రి నారా లోకేష్ చేసిన ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సిఇఓ తెలిపారు. మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌పోర్ట్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి లోకేష్. మంత్రి లోకేష్ బృందానికి మాస్కో రవాణా శాఖ ఉన్నతాధికారుల ఘనస్వాగతం. ఇటువంటి వ్యవస్థలు భారత్‌లో రావాల్సి ఉందన్న మంత్రి నారా లోకేష్.

మాస్కో: రష్యా పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్... రెండోరోజు మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌పోర్టు డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించారు. మంత్రి లోకేష్ బృందానికి మాస్కో ట్రాన్స్ పోర్టు కాంప్లెక్స్‌లోని సమాచార సాంకేతిక వ్యవస్థ, కమ్యూనికేషన్ డైరక్టరేట్, అటానమస్ ట్రాన్స్ పోర్టు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ విభాగాధిపతి పావెల్ బోక్షా, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ హెడ్ ఓల్గా పిచికోవా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రాన్స్ పోర్ట్ అండ్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (మాస్కో) సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ అలెగ్జాండర్ సువోరోవ్, మాస్కో ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ డైరక్టర్ జనరల్ సలహాదారు మస్తిస్లావ్ ఇసాకోవ్ ఘనస్వాగతం పలికారు.

టికెటింగ్ సిస్టమ్స్‌ను పరిశీలించిన లోకేష్ బృందం

అనంతరం యాంపి థియేటర్‌లో మాస్కో అటానమస్ ట్రాన్స్ పోర్టు సెంటర్ అభివృద్ధి గురించి పావెల్ బోక్షా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించగా, మాస్కో ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సెంటర్ కార్యకలాపాలు, పనితీరు గురించి మస్తిస్లావ్ ఇసాకోవ్ తెలియజేశారు. తర్వాత పక్కనే ఉన్న అధునాతన టికెటింగ్ సిస్టమ్స్, డెవలప్‌మెంట్ లేబరేటరీని లోకేష్ పరిశీలించారు. మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాన్స్ పోర్టు సెంటర్ పనితీరు అద్భుతం: లోకేష్

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజా రవాణా వ్యవస్థల్లో మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌పోర్ట్ సెంటర్ ఒకటిగా ఉంది. ఇది రవాణా నెట్‌వర్క్ నిర్వహణ, డిజిటలైజేషన్, ప్రయాణీకుల సౌకర్యార్థం ప్రత్యేక సాంకేతిక వ్యవస్థ కలిగి ఉంది. ఇక్కడ మెట్రో, బస్సులు, ట్రాలీలు, ఎలక్ట్రిక్ రైళ్లు, బైక్-షేరింగ్, స్కూటర్లు అన్నీ ఒకే పర్యావరణ వ్యవస్థ కిందకు తీసుకు వచ్చారు. వీటిని ప్రయాణికులు ఒకే మొబైల్ అప్లికేషన్ ద్వారా సులభంగా ఉపయోగించుకోవచ్చు. సబర్బన్ ప్రాంతాలను ప్రధాన కేంద్రంతో అనుసంధానించే అత్యాధునిక రైలు ప్రాజెక్టు మాస్కో సెంట్రల్ డయామీటర్స్ ఇందులో అంతర్భాగంగా ఉంది. ఇది నగరంలో మెట్రో రద్దీని తగ్గించడానికి ఎంతో దోహదపడుతోంది. మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్, ట్రాన్స్‌పోర్ట్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ సెంటర్లు కృత్రిమ మేధస్సు, సీసీ కెమెరాల ద్వారా నగరంలోని ట్రాఫిక్, భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడానికి ఇది సహాయపడుతోంది. మాస్కో అడ్వాన్స్‌డ్ ట్రాన్స్ పోర్టు డెవలప్‌మెంట్ సెంటర్ పనితీరు అద్భుతం. భారత్‌లో కూడా ఇటువంటి వ్యవస్థలు రావాల్సి ఉందని లోకేష్ అన్నారు. విశాఖలో ఎలక్ట్రానిక్ కాంపొనెంట్ అసెంబ్లీ యూనిట్ ఏర్పాటు చేయండి. నెల్లూరులో సెమీకండక్టర్ పరికరాల తయారీ యూనిట్ స్థాపించండి. శ్రీసిటీలో రోబోటిక్స్ & ఆటోమేషన్ సేవలను విస్తరించండి. ఎలిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ ఖజోవ్ ఒలెగ్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ.

మాస్కో: రష్యాకు చెందిన ప్రీమియర్ సెమీకండక్టర్స్ తయారీ సంస్థ ఎలిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ ఖజోవ్ ఒలెగ్, డైరక్టర్ (ఎక్సటర్నల్ రిలేషన్స్) కాన్ స్టాంటిన్ గోర్కోవ్, ఇంటర్నేషనల్ అండ్ కమర్షియల్ ప్రాజెక్ట్స్ హెడ్ జఖరోవ్ ఆంటోన్, చీఫ్ ఎక్సటర్నల్ రిలేషన్స్ స్పెషలిస్ట్ శ్రీమతి సిడోరుక్ ఎలిజవెటాలతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మాస్కోలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ...భారతదేశంలో విస్తరిస్తున్న డిజిటల్ రవాణా, బ్యాంకింగ్ కార్డ్ వ్యవస్థలకు అవసరమైన సురక్షితమైన RFID ట్యాగ్‌లు, స్మార్ట్ కార్డ్ మైక్రోచిప్‌లను స్థానికంగా తయారు చేసేందుకు ఎలిమెంట్ గ్రూప్ విశాఖపట్నం (వైజాగ్)లో ఒక ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ అసెంబ్లీ యూనిట్‌ను ఏర్పాటు చేయండి. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈవీ పవర్‌ట్రెయిన్, సోలార్ కన్వర్టర్ మార్కెట్లకు సరఫరా చేయడానికి, ఎలిమెంట్ టెక్నాలజీని ఉపయోగించి భాగస్వామ్య సంస్థలతో కలసి నెల్లూరులో సిలికాన్ కార్బైడ్, పవర్ సెమీకండక్టర్ పరికరాల తయారీ విభాగాన్ని ఏర్పాటు చేయండి. స్థానిక ఆటోమోటివ్, అసెంబ్లింగ్ లైన్లను ఆటోమేట్ చేయడానికి, ఇప్పటికే శ్రీ సిటీ (తిరుపతి జిల్లా)లో ఉన్న తయారీ దిగ్గజాలకు సమీపంలో జాయింట్ ఇండస్ట్రియల్ మోటార్ – సర్వో మోటార్ ప్రొడక్షన్ ఫెసిలిటీ ఏర్పాటు కాబోతోంది.

అక్కడ రోబోటిక్స్ సేవల కోసం ఎలిమెంట్ గ్రూప్ రోబోటిక్స్ & ఆటోమేషన్ డివిజన్ ఏర్పాటు చేయండి. కమ్యూ నికేషన్, నావిగేషన్, ఏరోస్పేస్ ఆన్-బోర్డ్ టెలిమెట్రీ సిస్టమ్‌ల కోసం మాడ్యులర్ కాంపోనెంట్‌లపై దృష్టి సారిస్తూ, వైజాగ్ హై-టెక్ కారిడార్‌లో ఒక సహకార మైక్రో ఎలక్ట్రానిక్స్ డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి. అమరావతి స్మార్ట్ సిటీ ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా స్మార్ట్ సిటీ హార్డ్‌వేర్ & ఐఓటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంటిగ్రేషన్ చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా అమరావతి రాజధాని నిర్మాణానికి ఎలిమెంట్ గ్రూప్ ఆధ్వర్యాన లోకలైజ్డ్ మైక్రోకంట్రోలర్‌లు, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హార్డ్‌వేర్ సరఫరా చేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఎలిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ ఖజోవ్ ఒలెగ్ స్పందిస్తూ... ఎలిమెంట్ గ్రూప్ కార్పొరేట్ విస్తరణలో భాగంగా భారత్‌లో రష్యన్ మైక్రోఎలక్ట్రానిక్స్ డిజైన్ హౌస్‌లు, భారతీయ టెక్ సంస్థల సాంకేతిక భాగస్వామ్యంతో సెమీకండక్టర్ పంపిణీ నెట్‌వర్క్‌లను నడిపిస్తున్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రానిక్ పోర్ట్‌ఫోలియో, సురక్షితమైన RFID మైక్రోచిప్‌లు, స్మార్ట్ కార్డ్ మాడ్యూల్స్, ట్రాన్స్‌పోర్ట్ కార్డ్ టెక్నాలజీలను దక్షిణాసియా ఆర్థిక రంగానికి ఎగుమతి చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ద్వైపాక్షిక టెక్ వ్యూహంలో భాగంగా తమ గ్రూప్ అధునాతన పవర్ ఎలక్ట్రానిక్స్, మైక్రోకంట్రోలర్లు IoT హార్డ్‌వేర్‌లను పంపిణీ చేయడానికి భారతీయ హార్డ్‌వేర్ డెవలపర్లతో కలిసి పనిచేస్తున్నామని అన్నారు. కీలకమైన వాణిజ్య విభాగాలు, దేశీయ టెలికాం, పారిశ్రామిక ఆటోమేషన్ తయారీదారుల కోసం కాంపోనెంట్ సోర్సింగ్, కాంపోనెంట్ లైసెన్సింగ్, సప్లయ్ చైన్ లాజిస్టిక్స్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి ఎపి ప్రభుత్వ ప్రతిపాదనలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఎలిమెంట్ ప్రతినిధులు పేర్కొన్నారు. మాస్కో ప్రధాన కేంద్రంగా 2019లో ఏర్పాటైన ప్రీమియర్ సెమీకండక్టర్స్ సంస్థ ఎలిమెంట్ గ్రూప్ 30కి పైగా డిజైనింగ్, మానుఫ్యాక్చరింగ్ సెంటర్లను కలిగి ఉంది.

ప్రస్తుతం ఈ సంస్థలో 9 వేల మందికి పైగా నిపుణులు పనిచేస్తున్నారు. 2025 ఆర్థిక సంవత్సరంలో ఎలిమెంట్ గ్రూప్ 38.5 బిలియన్ రూబుల్స్ (రూ.5,090 కోట్లు) ఆదాయాన్ని ఆర్జించింది.

# దక్షిణాసియా ఆర్థిక భవిష్యత్తును మార్చనున్న ‘ఆహార శుద్ధి’ రంగం



దక్షిణాసియా ప్రస్తుతం తన ఆహార రంగ ప్రయాణంలో ఒక కీలకమైన సంధి కాలంలో ఉంది. అపారమైన వ్యవసాయ వనరులతో, ఎంతో వైవిధ్యభరితమైన పంటలతో విలసిల్లుతున్న ప్రాంతమైనప్పటికీ, దురదృష్టవశాత్తూ పొలం నుంచి వినియోగదారుడి చేతికి వచ్చేలోపే చాలా ఎక్కువ ఆహారం వృథా అయిపోతోంది. ఇది రైతులకు కేవలం ఆదాయ నష్టం మాత్రమే కాదు; గ్రామీణ యువతకు దక్కాల్సిన ఉద్యోగాలను, ప్రజలకు అందాల్సిన పోషకాహారాన్ని కూడా చేజేతులా కోల్పోవడమే. భారతదేశ పరిస్థితి కూడా ఈ విరుద్ధమైన వాస్తవానికి అద్దం పడుతోంది. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ నివేదికల ప్రకారం, ప్రపంచంలోనే అత్యధికంగా పాలు, పప్పుధాన్యాలను పండిస్తున్న దేశం మనదే. అలాగే పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో మనం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నాం. ఇంతటి ఘనమైన రికార్డు ఉన్నప్పటికీ, పంట కోసిన తర్వాత సరైన నిర్వహణ లేకపోవడం, కోల్డ్ స్టోరేజీల కొరత, రవాణా లోపాలు, ప్రాసెసింగ్ సదుపాయాలు సరిపోకపోవడం వల్ల భారీ ఎత్తున ఆహారం వృథా అవుతోంది. ఇది అంతర్జాతీయ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతికి కూడా ఆటంకంగా మారుతోంది. నిజానికి ఇది కేవలం వ్యవస్థలోని లోపం మాత్రమే కాదు; మన ముందున్న ఒక అద్భుత అవకాశాన్ని వదిలేసుకోవడం. ఎందుకంటే, వృథా అవుతున్న ప్రతి టన్ను ఆహారమూ రైతుల కష్టార్జితాన్ని, యువతకు లభించాల్సిన ఉపాధిని, కుటుంబాలకు అందాల్సిన పోషకాలను తుడిచిపెట్టేస్తోంది. కాబట్టి, ఈ ఆహార నష్టాన్ని అరికట్టి, దాన్ని విలువైన ఉత్పత్తులుగా మార్చడ మనేది ఇప్పుడు ఈ ప్రాంత దేశాల తక్షణ ప్రాధాన్యత కావాలి. వ్యవసాయ రంగానికి ఆర్థిక జవసత్వాలు అందించాలంటే ఆహార శుద్ధి అత్యంత కీలకం. ఇది పొలాలను మార్కెట్లతో, రైతులను కార్పొరేట్ సంస్థలతో అనుసంధానించడమే కాకుండా, స్థానిక ఉత్పత్తిని ప్రాంతీయ, ప్రపంచ విలువ గొలుసులతో ముడిపెడుతుంది. తద్వారా వ్యవసాయ రంగాన్ని ఒక సరికొత్త ఆర్థిక విప్లవం వైపు నడిపించే వారధిగా పనిచేస్తుంది.

**పరిమాణం నుంచి విలువ వైపు**

గత కొన్ని దశాబ్దాలుగా మన వ్యవసాయ విధానాలు ఉత్పత్తిని పెంచడం, దేశానికి ఆహార భద్రతను కల్పించడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టాయి. ఆ ప్రయత్నాలు ఆశించిన ఫలితాలను ఇచ్చి, దేశానికి ఆహార భద్రతను చేకూర్చాయి. ఇప్పుడు మనం తదుపరి దశకు చేరుకున్నాం. ఇకపై కేవలం ‘ఉత్పత్తి పరిమాణం’ పైనే కాకుండా ‘విలువ సృష్టి’ పైకి మన దృష్టి మళ్లాలి. అంటే, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగాలను సృష్టించడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, ప్రజల్లో పోషకాహార లోపాన్ని నివారించడం వంటి లక్ష్యాల వైపు అడుగులు పడాలి. ప్రస్తుతం భారత్ లో మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో కేవలం 17 శాతం మాత్రమే ఆహార శుద్ధి జరుగుతోంది. ఈ రంగానికి ఉన్న పూర్తి ఆర్థిక సామర్థ్యాన్ని వాడుకోవాలంటే, 2030 నాటికి దీనిని కనీసం 25 శాతానికి పెంచాల్సిన అవసరముంది. అదే సమయంలో, పంట కోత తర్వాత జరుగుతున్న నష్టాలను అరికట్టడం, శుద్ధీకరణ రంగంతో వ్యవసాయాన్ని అనుసంధానించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో అధిక విలువ నిలిచేలా చూసుకోవచ్చు. ఆహార శుద్ధి వల్ల ఉత్పత్తుల నిల్వ కాలం పెరుగుతుంది, ఆహార భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయి. దీనివల్ల దేశీయంగానే కాక అంతర్జాతీయ మార్కెట్లలోనూ కొత్త అవకాశాలు లభిస్తాయి. అన్నింటికంటే ముఖ్యంగా, ముడి సరుకును పండించే దేశాల్లోనే ఆయా ఉత్పత్తుల అసలు ఆర్థిక విలువ నిలిచి ఉంటుంది. దీనివల్ల నేరుగా రైతులు, స్థానిక పరిశ్రమలు, గ్రామీణ సమాజాలు ఆర్థికంగా లబ్ధి పొందుతాయి.

**మార్కెట్ ఆధారిత విలువ గొలుసుల నిర్మాణం**

ఈ సమూల మార్పును సాకారం చేయాలంటే, పంట ఉత్పత్తి, సేకరణ దశల నుంచి ప్రాసెసింగ్, రవాణా, మార్కెట్ లభ్యత వరకు విలువ గొలుసులోని ప్రతి దశలోనూ సమన్వయంతో కూడిన పెట్టుబడులు అవసరం. నేటి వినియోగదారులు నాణ్యత, భద్రత, ఉత్పత్తి మూలాల వివరాలు, సరసమైన ధరలను కోరుకుంటున్నారు. ఈ మారుతున్న డిమాండ్లను అందుకోవాలంటే మరింత సమగ్రమైన, ఆధునిక విధానం అవసరం. ప్రపంచ వ్యాప్తంగా వైవిధ్యమైన, పోషకాలు దండిగా ఉండే ప్రత్యేక ఆహార పదార్థాలకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో, దక్షిణాసియాలోని సంపన్న వ్యవసాయ-జీవవైవిధ్యం మనకొక అద్భుత వరం. అధిక విలువ కలిగిన ఉత్పత్తులను తయారు చేయడానికి ఇది మనకు బాగా అనుకూలిస్తుంది. అలాగే, రోజురోజుకూ సంక్లిష్టంగా మారుతున్న అంతర్జాతీయ మార్కెట్లలో నాణ్యతా ప్రమాణాలను పెంచడానికి, పోటీతత్వాన్ని తట్టుకోవడానికి డిజిటల్ టెక్నాలజీలూ ఎంతో దోహదపడతాయి. ఈ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు ఎంత ముఖ్యమో, ప్రైవేట్ రంగం నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం అంతే ముఖ్యం. సులభతర వ్యాపార వాతావరణాన్ని కల్పించడం, వ్యాపారాల్లో నష్ట భయాలను తగ్గించడం, సమర్థవంతమైన ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహించడం ద్వారానే ఆశించిన స్థాయిలో పెట్టుబడులను సాధించగలం. భారత్ ఇప్పటికే ఈ దిశగా ‘ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన’, ‘ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం’, ఆహార శుద్ధి పరిశ్రమల కోసం ‘ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహం’ వంటి ప్రతిష్టాత్మక పథకాల ద్వారా కీలకమైన అడుగులు వేసింది. ఈ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తూ, కోల్డ్ చైన్‌లను విస్తరిస్తూ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కొండంత అండగా నిలుస్తున్నాయి.

**అవసరమైన చోట ఉద్యోగాల సృష్టి**

ఆహార శుద్ధి రంగం కేవలం ఆర్థిక వృద్ధికి సంబంధించినది మాత్రమే కాదు – ఇది లక్షలాది మంది జీవనోపాధికి సంబంధించిన అంశం. దక్షిణాసియా అంతటా ఏటా కోట్లాది మంది యువకులు శ్రామిక శక్తిలో చేరుతున్నారు. కేవలం సంప్రదాయ వ్యవసాయం మాత్రమే యువతకు పూర్తి స్థాయిలో ఉపాధిని కల్పించలేదు. ఈ సమస్యకు ఆహార శుద్ధి అద్భుత మార్గం. పంటలు పండే ప్రాంతాలకు దగ్గరగా ప్రాసెసింగ్ పరిశ్రమలను స్థాపించడం ద్వారా, కేవలం ఫ్యాక్టరీలకే పరిమితం కాకుండా.. రవాణా, ప్యాకేజింగ్, ఆహార సాంకేతికత, అనుబంధ సేవలలో వికేంద్రీకృత ఉపాధిని సృష్టిస్తుంది. ఇది గ్రామీణ యువతలో వ్యవస్థాపకతను పెంపొందిస్తుంది. చిన్న, సూక్ష్మ పరిశ్రమలు క్రమబద్ధమైన సంస్థలుగా ఎదిగి, ఆధునిక మార్కెట్ గొలుసులలో భాగస్వాములు కావడానికి వీలు కల్పిస్తుంది. ఆహార పదార్థాల విలువను పెంచడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాలలో, ముఖ్యంగా మహిళలు, యువతకు స్థానికంగానే గౌరవప్రదమైన, అర్థవంతమైన ఉద్యోగాలను పెద్ద ఎత్తున సృష్టించడమే ఈ రంగం అసలైన విజయం.

**మారుతున్న ప్రపంచ మార్కెట్‌లో పోటీతత్వం**

ప్రపంచ మార్కెట్‌లో శుద్ధి చేసిన భారత ఆహార ఎగుమతులు స్థిరంగా పెరుగుతున్నాయి. కొత్తగా కుదుర్చుకుంటున్న అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు సరికొత్త మార్కెట్లను పరిచయం చేస్తున్న తరుణంలో, మన వ్యూహం మారాలి. ఇకపై కేవలం ముడి సరుకులను ఎగుమతి చేసే దేశంగా కాకుండా, అధిక విలువ కలిగిన బ్రాండెడ్ ప్రాసెస్డ్ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి. నేటి అంతర్జాతీయ వినియోగదారులు తాము తినే ఆహారం సురక్షితమైనదా, కాదా? అందులో పోషక విలువలు ఉన్నాయా? అది ఏ ప్రాంతంలో, ఏ పద్ధతుల్లో పండించారు? అనే విషయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అంటే నాణ్యత, అంతర్జాతీయ ప్రమాణాలు, సరికొత్త ఆవిష్కరణలకే ప్రస్తుతం మార్కెట్‌లో విలువ ఎక్కువ. ఈ రంగాలలో భారతదేశం తన సామర్థ్యాలను రోజురోజుకూ పటిష్టం చేసుకుంటోంది. ఈ అవకాశాలను మనం పూర్తిగా చేజిక్కించుకోవాలంటే సాంకేతికత, నాణ్యమైన మౌలిక వసతులు, బ్రాండింగ్‌లపై మరిన్ని పెట్టుబడులు పెట్టాలి. అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీ పడగల విలువ గొలుసులను నిర్మించడం వల్ల, మన ఉత్పత్తిదారులు, పరిశ్రమలు ప్రపంచ మార్కెట్‌లో అగ్రశ్రేణికి చేరుకోగలుగుతారు.

**మూలస్తంభంగా సుస్థిరత**

ఆహార వ్యవస్థల పరివర్తన కేవలం లాభాల కోసమే కాక, పర్యావరణానికి మేలు చేసేలా, సుస్థిరంగా, భవిష్యత్ సవాళ్లను తట్టుకునేలా ఉండాలి. భూమి, నీరు, ఇంధన వనరులపై పడుతున్న ఒత్తిడిని తగ్గించడానికి ఆహార వృథాను అరికట్టడం అత్యంత ప్రభావవంతమైన మార్గం.

అదే సమయంలో, వ్యర్థాల నుంచి విలువను సృష్టించే సరికొత్త ఆవిష్కరణలు – అంటే వ్యవసాయ ఉప-ఉత్పత్తులను తిరిగి ఉపయోగపడే కొత్త ఉత్పత్తులుగా మార్చడం – పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తూనే, సరికొత్త ఆర్థిక అవకాశాలను సృష్టిస్తున్నాయి. ఒక సుస్థిర ఆహార ప్రాసెసింగ్ పర్యావరణ వ్యవస్థ సమాజానికి అన్ని విధాలా మేలు చేస్తుంది, ప్రజలకు మెరుగైన పోషకాహారాన్ని అందిస్తుంది, పర్యావరణ నష్టాన్ని తగ్గిస్తుంది, యావత్ ఆహార గొలుసు పొడవునా ఆదాయాలను, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుంది.

**దక్షిణాసియా నాయకత్వానికి ఒక గొప్ప అవకాశం**

విచ్ఛిన్నమైన సరఫరా గొలుసులు, పరిమితమైన పరిశ్రమలు, అధిక పంట కోత అనంతర నష్టాల వంటి సమస్యలతో దక్షిణాసియా దేశాలన్నీ దాదాపు ఒకే రకమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ తరుణంలో ఈ ప్రాంత దేశాలన్నీ కలిసికట్టుగా పని చేయాలి. ఈ ఉమ్మడి సమస్యలే మనల్ని ఒకే తాటిపైకి తెచ్చి, ఉమ్మడి పరిష్కారాల వైపు నడిపించడానికి అద్భుతమైన అవకాశాలుగా మారతాయి. ‘సౌత్ ఏషియన్ పాలసీ లీడర్‌షిప్ ఫర్ ఇంప్రూవ్డ్ న్యూట్రిషన్ అండ్ గ్రోత్’ వంటి ప్రాంతీయ వేదికలు ఈ సానుకూల మార్పునకు అవకాశాన్నిస్తాయి. ఏ ఒక్క దేశమూ ఒంటరిగా సాధించలేని పరస్పర సహకారాన్ని, విజ్ఞాన మార్పిడిని, పెట్టుబడుల వాతావరణాన్ని ఇవి సాధ్యం చేస్తున్నాయి. ఇటీవల జరిగిన ‘అన్‌లాకింగ్ వాల్యూ’ ఉన్నత స్థాయి చర్చా వేదిక ఈ ఉమ్మడి నిబద్ధతకు ఒక నిదర్శనం. ఈ ప్రాంతంలోని విధాన రూపకర్తలు, ఆవిష్కర్తలు, పరిశ్రమల అధిపతులు, అభివృద్ధి భాగస్వాములను ఇది ఒకే చోటికి చేర్చింది. అందరికీ మెరుగైన ఉపాధిని, మరింత పటిష్టమైన ఆహార వ్యవస్థలను అందించేందుకు అవసరమైన భాగస్వామ్యాలను, వ్యూహాలను రూపొందించడానికి ఇదో వేదికగా నిలిచింది. ఉత్పత్తిలోనూ, సమర్థవంతమైన విధాన రూపకల్పనలోనూ ముందంజలో ఉన్న భారత్, ఈ ప్రాంతీయ పరివర్తనను ముందుండి నడిపించడంలో కీలక పాత్ర పోషించాల్సి ఉంది.

**విధానాల నుంచి కార్యాచరణ వైపు**

మన ముందున్న మార్గం చాలా స్పష్టం. మనం సంప్రదాయ పద్ధతుల్లోనే ఉంటూ సరఫరా గొలుసులో ఆహార విలువను వృథా చేసుకోవచ్చు, లేదా ప్రతి దశలోనూ విలువను సృష్టించే ఒక ఆధునిక, సమగ్రమైన వ్యవస్థను నిర్మించుకోవచ్చు. మనం కేవలం ముడి సరుకులను ఎగుమతి చేసే దేశాలుగానే ఉండిపోవచ్చు, లేదా అధిక విలువ కలిగిన, సుస్థిరమైన ఆహార ఉత్పత్తులలో ప్రపంచానికే నాయకత్వం వహించవచ్చు. ఈ పరివర్తనకు ఏకైక మార్గం – ఆహార శుద్ధి. చిన్న పొలాల నుంచి పెద్ద పరిశ్రమల వరకు, స్థానిక సంతల నుంచి అంతర్జాతీయ మార్కెట్ల వరకు ఆహార వ్యవస్థలలో మనం తీసుకువచ్చే మార్పులే మన ప్రాంత ఆర్థిక భవిష్యత్తును నిర్ణయిస్తాయి.సరైన విధానాలు, పక్కా పెట్టుబడులు, బలమైన భాగస్వామ్యాల కలయికతో, దక్షిణాసియా దేశాలు ఆహార నష్టాన్ని అధిగమించి, ప్రపంచ ఆహార రంగానికి నాయకత్వం వహించే స్థాయికి చేరుకోగలవు. ఇదే ఆశావహ స్ఫూర్తితో, కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ తదుపరి ‘SAPLING ఉన్నత స్థాయి విధాన సంభాషణ’ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. దక్షిణాసియా అంతటా ఉపాధిని పెంచేందుకు, కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు, పటిష్టమైన ఆహార వ్యవస్థలను నిర్మించేందుకు గాను ప్రపంచ బ్యాంక్ బృందంతో సహా వివిధ దేశాల ప్రభుత్వాలను, పారిశ్రామికవేత్తలను, అభివృద్ధి భాగస్వాములను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకు రానుంది.

రచయిత:
**శ్రీ చిరాగ్ పాశ్వాన్**
(కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి)



# స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని పరిశీలించిన డిప్యూటీ ఎంపీడీవో

**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలం పరిధిలో పెనుగుదురు, పాతర్లగడ్డ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు పరిశీలించారు.

గ్రామాల్లో రహదారుల పక్కన పేరుకుపోయిన చెత్తను వర్గీకరించడం, వ్యర్థాల పోగులను తొలగిం చడం, వాటిని సంపద సృష్టి కేంద్రాలు, కేటాయించిన ప్రదేశాలకు తరలించే పనులను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. పాఠశాలలు, వీధులు, ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుతూ, తడి-పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి సరైన ప్రదేశాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

# పల్లె వీక్షణ అర్జీలను 30 రోజుల్లో పరిష్కరిస్తాం

## - రెవెన్యూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ టీం - భూ అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించం... కఠినంగా శిక్షిస్తాం - ఫేక్ డాక్యుమెంట్లు సృష్టిస్తే జైలుకే : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల - కుల్లూరులో కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పర్యటన

**కలువాయి, (రాజధాని వార్తలు):** జిల్లాలో వినూత్నంగా నిర్వహిస్తున్న పల్లె వీక్షణ కార్యక్రమంలో ప్రజల అందిస్తున్న అర్జీలను 30 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపట్టామని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. శుక్రవారం కలువాయి మండలం కుల్లూరు గ్రామంలో వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణతో కలిసి కలెక్టర్ పల్లె వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. కుల్లూరు పంచాయతీ పరిధిలోని రాజుపాలెం వద్ద ఉపాధి హామీ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి పనుల నాణ్యతపై అధికారులకు సూచనలు చేశారు. సమీపంలో ఉన్న మామిడి తోటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కుల్లూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో మమేకమై వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. మంచి నీటి నాణ్యతను పరిశీలించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.



**గ్రామస్తులతో ముఖాముఖి... అర్జీల స్వీకరణ**

అనంతరం జిల్లాస్థాయి అధికారులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామస్తులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి పలు అర్జీలు స్వీకరించారు. అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు తెలిపిన ప్రతి సమస్యను క్షుణ్ణంగా ఆలకించిన కలెక్టర్, ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మీడియాతో మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నూటికి నూరు శాతం సమర్థవంతంగా అమలు చేస్తూ అర్హులందరికీ అందేలా పర్యవేక్షించడమే "పల్లె వీక్షణ" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సంతృప్తి స్థాయిని స్వయంగా తెలుసుకుని, ఎక్కడైనా లోపాలు ఉంటే చక్కదిద్దేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ గ్రామంలో రైతులు ప్రధానంగా రెవెన్యూ భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, దొంగ పట్టాలు సృష్టించడం, ఎస్సీ ఎస్టీల భూములను ఆక్రమించడం, రీ సర్వే సమస్యలపై ఎక్కువగా ప్రజలు అర్జీలు అందించారని కలెక్టర్ వివరించారు. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల పరిధిలో పల్లె వీక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు. పల్లె వీక్షణ కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను నెల రోజుల్లో పై పరిష్కరించేలా చర్యలు చేపట్టామని, ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ప్రత్యేక ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నామని చెప్పారు. ప్రధానంగా ఈ కార్యక్రమంలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటుచేసి ఆ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

భూ అక్రమాలకు పాల్పడినా, దొంగ పట్టాలు సృష్టించి నిజమైన లబ్ధిదారులు మోసం చేసినా అటువంటి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని కలెక్టర్ హెచ్చరిం చారు. రాజుపాలెం గ్రామంలో ఒక ఛాంపియన్ ఫార్మర్ ఇతర రైతులకు ఆదర్శంగా కవర్ మ్యాంగో ప్రయోగం చేసి మంచి దిగుబడి లాభాలు సాధించాడని, ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది రైతులు ఈ విధానాన్ని ఆచరించాలని కలెక్టర్ సూచిం చారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరించే సరికొత్త కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకా రం చుట్టిందన్నారు. కుల్లూరు పంచాయతీ పరిధిలో గత రెండేళ్లలో రూ.6.80 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనతో పల్లె వీక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. తన నియోజకవర్గ పరిధిలో మూడు మండలాల్లో పల్లె వీక్షణ కార్యక్రమం చాలా బాగా జరిగిందని, ఇదేవిధంగా తిరుపతి జిల్లా పరిధిలోని తన నియోజకవర్గంలో కూడా ఈ కార్యక్రమాన్ని చేపట్టేలా అక్కడి కలెక్టర్ ను కూడా కోరనున్నట్లు చెప్పారు. అనంతరం కలువాయి మండలంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. పలువురు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఉన్నతి పథకం ద్వారా రుణాలను అందజేశారు. వికలాంగులకు నివేశ స్థల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ మహబూబ్ బాషా, ఆర్డీఓ పావని, జడ్పీ సీఈఓ శ్రీధర్ రెడ్డి, డీపీఓ వసుమతి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, డీఎం అండ్ హెచ్‌వో సుజాత, ఇరిగేషన్, విద్యుత్ శాఖ ఎస్ఈలు దేశ్ నాయక్,రాఘవేంద్రన్, వివిధ శాఖల అధికారులు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

# స్కాముల ప్రభుత్వం అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదం

## - వైసీపీ పాలన, తీరుపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ధ్వజం - బుచ్చిరెడ్డిపాళెంలో రూ.2 కోట్లతో సీసీ రోడ్లకు శంకుస్థాపన - 'ఐ లవ్ బుచ్చిరెడ్డిపాళెం' లైటింగ్ సిస్టం ఆవిష్కరణ

**బుచ్చిరెడ్డిపాళెం, (రాజధాని వార్తలు):** బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నాడు ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ స్పెషల్ గ్రాంట్ రూ.2 కోట్లతో మంజూరైన సిమెంటు రోడ్ల నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే, బైపాస్ రోడ్డు నుంచి శేషాద్రి నగర్ రోడ్డు వరకు రూ.50 లక్షల నుడా నిధులతో నిర్మించిన సీసీ డ్రెయిన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ బొమ్మ సెంటర్ వద్ద మున్సిపాలిటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'ఐ లవ్ బుచ్చిరెడ్డిపాళెం' ఎల్ఈడీ లైటింగ్ సిస్టమ్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వ విజయాలను, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.



**9 నెలల్లోనే మెగా డీఎస్సీ.. నిరుద్యోగులకు ఉద్యోగాలు**

గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో నిరుద్యోగులకు 'డీఎస్సీ' అంటే ఏంటో తెలియకుండా చేశారని, జాబ్ క్యాలెండర్ల పేరుతో మోసం చేస్తూ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల కాలంలోనే డీఎస్సీ ప్రకటించి, రాష్ట్రంలో 16 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారు. నేడు ఏ మొహం పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలు డీఎస్సీపై మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

**కోవూరు నియోజకవర్గంలో రికార్డు స్థాయి అభివృద్ధి**

కోవూరు నియోజకవర్గంలో ప్రతిపక్షాలు 'వెన్నుపోటు' కార్యక్రమాలు చేసే ముందు ఇక్కడ జరిగిన అభివృద్ధిని కళ్లారా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఎన్నో ఏళ్లుగా దుస్థితిలో ఉన్న రోడ్లకు నేడు రూ.2 కోట్లు కేటాయించి అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. మలిదేవి కాలువ, ముదివర్తి కాజ్‌వే, మైపాడు-నెల్లూరు రోడ్డు పనులతో పాటు పీఫోర్ విధానంలో బుచ్చిరెడ్డిపాళెం మార్కెట్‌ను అద్భుతంగా నిర్మించుకున్నామని తెలిపారు. పిఫోర్ పథకం ద్వారా ఎంతో మంది 'బంగారు కుటుంబాలను' దత్తత తీసుకుని లబ్ధి చేకూర్చామని, ఆ వివరాలను వెళ్లి పరిశీలించవచ్చన్నారు.

**సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు అండ**

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సూపర్ సిక్స్' పథకాలు రాష్ట్రంలో సూపర్ హిట్ అయ్యాయని ఎమ్మెల్యే కొనియాడారు. స్త్రీ శక్తి పథకం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల వారికి ఛార్జీలు మిగిలి, కుటుంబాలకు పెద్ద ఆసరాగా నిలుస్తోందన్నారు.

**ఉచిత సిలిండర్లు:** ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నామని చెప్పారు.

**ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు:** గత ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద ల్యాండ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని చెప్పిన విధంగానే రద్దు చేశామన్నారు. రైతుల పాస్ బుక్కులపై గత పాలకుల ఫోటోలు తీసేసి, అధికారిక 'రాజముద్ర'తో 'మీ భూమి – మీ హక్కు' గ్యారంటీతో కొత్త పట్టాదారు పాస్ బుక్కులను అందజేశామని స్పష్టం చేశారు.

**అన్నదాత సుఖీభవ:** గత ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఎక్కువగా రైతులకు రూ.20 వేలు అందించి అన్నదాతలను ఆదుకున్నామన్నారు. గతంలో కాలువలు తవ్వక, రైతు సంఘాలు లేక వ్యవసాయం దెబ్బతింటే, నేడు కాలువలన్నీ కళకళలాడుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మి 6 నెలలైనా డబ్బులు రాక రైతులు అల్లాడిపోగా, నేడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కేవలం 24 గంటల్లోనే కూలీల నగదుతో సహా మొత్తం సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని స్పష్టం చేశారు.

**కొత్త పింఛన్లు:** రాబోయే జూన్ 12 నుంచి కొత్త పింఛన్లను పంపిణీ చేయబోతున్నామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వెల్లడించారు.

**గృహనిర్మాణ భారీ స్కామ్ బయటపెడతాం**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గృహనిర్మాణాల పేరుతో అంతులేని అవినీతి జరిగిందని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ఇళ్ల ప్లాట్ల కోసం భూసేకరణలో ఎకరా రూ.10 లక్షల విలువైన భూమిని రూ.30 లక్షలకు కొనుగోలు చేసి భారీ స్కామ్‌కు పాల్పడ్డారని, దానికి తోడు లెవలింగ్ పేరుతో మరో రూ.10 లక్షలు దోచుకున్నారని మండిపడ్డారు. నెల్లూరులో పెద్ద భవనాలు ఉన్నవారికి కూడా ఇళ్లు మంజూరు చేశారని, ఇళ్ల నిర్మాణాలు చేసే కాంట్రాక్టర్ల వద్ద కూడా డబ్బులు వసూలు చేశారని చెప్పారు. పేదల డబ్బులు నొకేసి కాంట్రాక్టర్లు ఇళ్లు కట్టకుండా వెళ్లిపోయారని, తీరా ఇప్పుడు చూస్తే ఆన్‌లైన్‌లో మాత్రం పేదల పేరిట ఇళ్లు పూర్తయినట్లు చూపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి స్కామ్‌లు చేసినందుకా వైసీపి నేతలు 'వెన్నుపోటు దినాలు' జరుపుకునేది అని ప్రశ్నించారు. కనీస పరిజ్ఞానం ఉన్న ప్రజలెవరూ ఇలాంటి వారిని నమ్మరని హితవు పలికారు.

**24 నెలల్లో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు**

డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఇంటికో వ్యాపారవేత్తగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన పాలనలో, యువనేత, రాష్ట్ర ఐటీ అండ్ పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ బాబు చొరవతో ప్రభుత్వం వచ్చిన 24 నెలల్లోనే (రెండేళ్లలోనే) రాష్ట్రానికి రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చామని, తద్వారా 6 లక్షల ఉద్యోగాలను కల్పించామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మున్సిపల్ కమీషన్ చిన్నిబాబు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశాంతిరెడ్డితోనే నియోజకవర్గం మహానాడు సక్సెస్

## - అభివృద్ధి ప్రదాత ప్రశాంతి రెడ్డే : టీడీపీ యువత అధ్యక్షులు బద్దిపూడి సూర్య


**కొడవలూరు, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం పాలన రెండు ఏళ్ళు పూర్తి అయిన నేపథ్యంలో కోవూరు నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి ప్రదాతగా గుర్తింపు వచ్చిన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి తాము కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు. కొడవలూరు మండలం టీడీపీ యువత అధ్యక్షులు బద్దిపూడి సూర్య అన్నారు. అదేవిదంగా నియోజకవర్గం వర్చువల్ హైబ్రీడ్ మహానాడు కార్యక్రమాలపై ఎమ్మెల్యే ద్రుష్టి సారించడంతో అన్ని మండలాల్లో సపలీ కృతం చేసారని. టీడీపీ నాయకులు క్లస్టర్‌లు పార్టీ ఆయా మండలం అధ్యక్షులు కృషి సహకారంతో కష్టపడి పని చేసిన వారందరికీ తన వంతు తాను అభినందనలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమం వల్ల ప్రజలు వద్ద ఎమ్మెల్యేకు ప్రజాదరణ మెండుగా ఉందని అన్నారు. మహానాడు మంగళగిరిలో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ నాయకత్వంలో రెండు పాటు జరిగిన వేదికలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పాల్గొని కూటమి పాలనలో జరిగిన అభివృద్ధిని చక్కగా వివరించడం తామందరికి ఎంతో గర్వకారణంగా ఉందని సూర్య ప్రశంసించారు. చిత్తశుద్ధితో పనిచేసే ఎమ్మెల్యే కోవూరుకు రావడం ప్రజలు చేసుకొన్న అదృష్టంగా భావిస్తున్నారని



అన్నారు. రాష్ట్ర స్థాయిలో కల్ల మొదటి స్థానములో కోవూరు నియోజక వర్గం మహానాడు విజయవంతంగా సాగిందని అన్నారు. ఇదంతా సపలీకృతం కావడానికి ఎమ్మెల్యే ప్రశాంతమ్మ కృషి ఫలితమేనని బద్దిపూడి సూర్య అన్నారు. కొడవలూరు మండలంలోని టీడీపీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, బూలోకం విజయకుమార్, స్థానిక టీడీపీ నేతలకు, కార్యకర్తలకు అభిమానులకు మహానాడును విజయవంతముకు సహకరించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదములను బద్దిపూడి తెలిపారు.

# అనుమాలశెట్టి కిశోర్ 50వ జన్మదిన వేడుకలు...పేదలకు అన్నప్రసాద వితరణ





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సమాజంలో ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు వేడుకలను విలాసవంతంగా జరుపుకుంటున్న ఈ రోజుల్లో, అనుమాలశెట్టి కిశోర్ తన 50వ వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా ఒక గొప్ప సేవా మార్గాన్ని ఎంచుకున్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని సెయింట్ జాన్స్ హాస్పిటల్ నందు రోగులకు, అక్కడ పనిచేసే సిబ్బందికి ఆహార పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సుమారు 150 కి పైగా వెజ్ పలావ్ ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిశోర్ సోదరుడు మీడియాతో మాట్లాడుతూ... తన అన్న 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వినూత్న కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆహారంతో పాటు, చుట్టు పక్కల ఉన్న పేద ప్రజలందరికీ సుమారు 300 టవల్స్ పంపిణీ



చేస్తున్నామని వెల్లడించారు. కిశోర్‌ని స్ఫూర్తిగా తీసుకుని మరికొంతమంది ముందుకు వచ్చి ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన కోరారు. తన అన్న ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# సంపాదకీయం

## ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత, అన్ని కాలాలకు అనువైన గ్రామ రహదారుల వ్యవస్థ అవసరం

### - గ్రామీణ సమ్మిళితత్వానికి రాజమార్గం

దశాబ్దాలుగా, ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ మౌలిక సదుపాయాల ప్రణాళిక దీర్ఘకాలికంగా దూరదృష్టి లోపంతో సతమతమౌతోంది. ప్రతి వర్షాకాలంలో భారీ వర్షాలు పెళుసైన గ్రామీణ మార్గాలను కొట్టుకు పోతున్నాయి. గుంతలు ప్రమాదకరమైన గొయ్యిలుగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి చర్యగా ప్యాచ్‌లు వేయడం, పూడ్చడం, తాత్కాలికంగా రోడ్డును పునరుద్ధరించడం వంటి పనులతో హడావిడిగా స్పందిస్తుంది. పరిపాలన పట్ల ఈ తాత్కాలిక విధానం ఇకపై ఆమోదయోగ్యం కాదు. ఆంధ్రప్రదేశ్ ఒక ఆర్థిక శక్తిగా మారాలంటే, రాష్ట్రం ప్రతిచర్యాత్మక నిర్వహణ నుండి దూరదృష్టితో కూడిన, దీర్ఘకాలిక వ్యూహానికి మారాలి. ప్రతి ఒక్క గ్రామం నలుమూలలా విస్తరించి ఉండే శాశ్వత, నాణ్యమైన, సమగ్రమైన రహదారుల వ్యవస్థను నిర్మించడం.

**"గుంతల రాజకీయాలను" అధిగమించడం**

ప్రస్తుత విధానం గ్రామీణ రహదారులను ద్వితీయ మౌలిక సదుపాయాలుగా పరిగణిస్తుంది–అవి పూర్తిగా ప్రయాణిం చలేనివిగా మారినప్పుడు మాత్రమే శ్రద్ధ అవసరమయ్యే ప్రధాన మార్గాలుగా చూస్తుంది. సాధారణ స్థానిక సంస్థల చర్యలు సాధారణంగా గుంతలను పూడ్చడం లేదా ఒకే సీజన్‌లో పాడై పోయే నాసిరకం కంకర రోడ్లను వేయడంపైనే దృష్టి పెడతాయి. ఈ "గుంతల రాజకీయాలు" ఆర్థికంగా క్షీణింపజేస్తాయి, ఆర్థికంగా స్తంభింపజేస్తాయి:

**ఆర్థిక నష్టం:**

తాత్కాలిక మరమ్మతుల కోసం ఏటా లక్షలాది రూపాయలు ఖర్చవుతున్నాయి. ఇది చిన్న విషయాలలో పొదుపు చేసి, పెద్ద విషయాలలో తెలివి తక్కువగా ప్రవర్తించడానికి ఒక చక్కటి ఉదాహరణ.

**మానవ నష్టం:**

ఒక గ్రామ రహదారి పాడైపోయినప్పుడు, మొత్తం జీవావరణ వ్యవస్థ స్తంభించిపోతుంది. రైతులు త్వరగా పాడైపోయే పంటలను కోల్డ్ స్టోరేజీలకు లేదా ప్రధాన మార్కెట్లకు రవాణా చేయలేరు, దీనివల్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురై అమ్ముకోవలసి వస్తుంది. గర్భిణీ స్త్రీలు, వైద్య అత్యవసర పరిస్థితులలో ఉన్నవారు ఉప–విభాగ ఆసుపత్రులకు చేరుకోవడానికి ప్రాణాంతకమైన ఆలస్యాన్ని ఎదుర్కొంటారు. భారీ వర్షాల సమయంలో, చదువుకునే "మార్గం" అక్షరాలా బురదమయమై పోవడం వల్ల పిల్లలు పాఠశాలకు వెళ్లలేరు. శాశ్వత రహదారి వ్యవస్థ అనేది ఒక విలాసం కాదు; అది ప్రాథమిక మానవ హక్కులకు, ఆర్థిక గౌరవానికి ఒక ప్రాథమిక అవసరం.

**దార్శనికత:**

ఏ గ్రామాన్నీ విడిచిపెట్టని గ్రిడ్ ఆంధ్రప్రదేశ్‌కు కావలసింది ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్. ఇది గ్రామాల అనుసంధానాన్ని, ఒక జాతీయ రహదారి ప్రాజెక్టుకు ఇచ్చేంతటి ఇంజనీరింగ్ పటిష్టతతో, బడ్జెట్ పరమైన ప్రాధాన్యతతో పరిగణించాలి. ఈ శాశ్వత నెట్‌వర్క్ మూడు రాజీ పడని సూత్రాల ద్వారా నిర్వచించబడాలి:

1. నిర్మాణ శాశ్వతత్వం (వాతావరణ మార్పులను తట్టుకునే ఇంజనీరింగ్)

చౌకైన, సులభంగా కోతకు గురయ్యే పదార్థాలకు బదులుగా, గ్రామీణ రోడ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైట్–టాపింగ్ (కాంక్రీట్) లేదా ఉన్నత శ్రేణి, బహుళ పొరల బిటుమెన్ డిజైన్లను తప్పనిసరి చేయాలి. తీరప్రాంత, అంతర్గత ఆంధ్రలో తీవ్రమవుతున్న వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాల దృష్ట్యా, గ్రామీణ మౌలిక సదుపాయాలకు ప్రధాన హంతకురాలైన నీటి నిల్వను నివారించడానికి ఈ రహదారులను సమీకృత మురుగునీటి పారుదల వ్యవస్థలతో నిర్మించాలి.

2. సంపూర్ణ విస్తరణ ("పొడవు మరియు వెడల్పు")

అనుసంధానం కేవలం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దనో లేదా ఒక ప్రధాన నివాస ప్రాంతం యొక్క ప్రధాన ద్వారం వద్దనో ఆగిపోకూడదు. ఈ నెట్‌వర్క్ ఒక గ్రామం మొత్తం భౌగోళిక స్వరూపాన్ని కవర్ చేయాలి, తద్వారా వ్యవసాయ క్షేత్రాలు, షెడ్యూల్డ్ కులాలు/తెగల కుగ్రామాలు, మారుమూల శివారు ప్రాంతాలు ప్రధాన గ్రిడ్‌కు సజావుగా అనుసంధానించబడాలి. నిజమైన అభివృద్ధి సమ్మిళితమైనది,, మధ్యలోనే ఆగిపోయే రహదారి సగంలోనే విఫలమైన విధానంతో సమానం.

3. అంతరరవాణా ఆర్థిక సమైక్యత

ఈ శాశ్వత గ్రామ రహదారులు ఆధునిక వ్యవసాయ యంత్రాలు, వాణిజ్య రవాణా వాహనాలకు అనుకూలంగా ఉండేంత వెడల్పుగా ఉండాలి. వ్యవసాయ క్షేత్రాల నుండి రాష్ట్ర రహదారుల వరకు సరుకు రవాణా సజావుగా జరిగేలా చూడటం ద్వారా, గోదావరి జిల్లాల్లోని జలచర రైతులు, గుంటూరులోని మిరప రైతులు, రాయలసీమలోని పండ్ల తోటల రైతుల రవాణా ఖర్చులను ప్రభుత్వం గణనీయంగా తగ్గించగలదు.

అమలుకు ఒక ప్రణాళిక

ఇంతటి భారీ ప్రాజెక్టును అమలు చేయడానికి, విచ్ఛిన్నమైన, తాత్కాలిక కాంట్రాక్టర్ల వ్యవస్థల నుండి వైదొలగడం అవసరం. రాష్ట్ర ప్రభుత్వం బహుముఖ అమలు వ్యూహాన్ని పరిగణనలోకి తీసుకోవాలి: ఏకీకృత గ్రామీణ మౌలిక సదుపాయాల నిధి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల నుండి నిధులను ఏకీకృతం చేసి, శాశ్వత గ్రామీణ ఆస్తుల సృష్టికి మాత్రమే ప్రత్యేకంగా కేటాయించిన ఒకే నిధిగా ఏర్పాటు చేయాలి. ఆస్తుల మ్యాపింగ్, జవాబుదారీతనం: ప్రతి ఒక్క గ్రామీణ రహదారి విభాగం నిర్మాణాన్ని పర్యవేక్షించడానికి GIS మ్యాపింగ్‌ను ఉపయోగించాలి. కాంట్రాక్టర్లు తప్పనిసరిగా 5 నుండి 10 సంవత్సరాల నిర్వహణ నిబంధనకు కట్టుబడి ఉండాలి. తద్వారా, ఒకవేళ రహదారి గడువుకు ముందే పాడైపోతే, దాని ఆర్థిక భారం పన్ను చెల్లింపుదారులపై కాకుండా నిర్మాణదారుడిపైనే పడేలా చూడాలి. దశలవారీగా రాష్ట్రవ్యాప్త అమలు: వ్యవసాయ ఉత్పత్తి, ఇప్పటికే ఉన్న కనెక్టివిటీ లోపాల ఆధారంగా గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అన్ని జిల్లాల్లో 100% శాశ్వత కనెక్టివిటీని సాధించడానికి కఠినమైన 5 సంవత్సరాల కాలపరిమితిని నిర్దేశించాలి. పెట్టుబడి బ్రోచర్‌లలో వంతెనలు, రహదారులు అద్భుతంగా కనిపిస్తాయి, కానీ ఒక రాష్ట్ర మానవ అభివృద్ధి సూచికలో నిజమైన మార్పును తీసుకువచ్చేది మాత్రం సామాన్యమైన గ్రామ రోడ్డే. ఒక గ్రామం బాహ్య ప్రపంచంతో శాశ్వతంగా అనుసంధానమైనప్పుడు, భూమి విలువలు స్థిరపడతాయి, గ్రామీణ పరిశ్రమలలోకి ప్రైవేట్ పెట్టుబడులు నెమ్మదిగా ప్రవహిస్తాయి, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి జనసాంద్రత అధికంగా ఉన్న నగరాలపై వలసల ఒత్తిడి తగ్గుతుంది. ఒక మారుమూల గ్రామానికి శాశ్వత రహదారి వేయడం అనేది ఖర్చు కాదని, అది తరతరాల పెట్టుబడి అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రహించాలి. తాత్కాలిక మరమ్మతులకు ఉపయోగించే తారు బకెట్లను పక్కనపెట్టి, భారీ కాంక్రీట్ మిక్సర్లను రంగంలోకి దించాల్సిన సమయం ఆసన్నమైంది. ఆంధ్ర హృదయాన్ని దాని భవిష్యత్తుకు అనుసంధానిస్తూ, శాశ్వతంగా నిలిచే ఒక నెట్‌వర్క్‌ను నిర్మించాల్సిన అవసరం ఉంది, ఆ దిశగా ప్రభుత్వాలు నిర్మాణాత్మక చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేయాలి.

## మాజీ సర్పంచ్ నాశన వెంకట రమణయ్య జ్ఞాపకార్థంగా మనవళ్లు అన్నదానం



**విడవలూరు/కొడవలూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు గ్రామానికి ఎంతో అభివృద్ధి చేసిన దివంగత నేత మాజీసర్పంచ్ నాశన వెంకటరమణయ్య 5వ వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు మల్లికార్జున తనయుడులు మహేష్, రాజేష్‌లు దాతృత్వములో కొడవలూరు తపా తోపు వద్ద ఉన్న అనాధాశ్రమము పిల్లలకు అన్నదానం చేసారు. అదేవిధంగా విడవలూరులో కూడా మజ్జిగ పానీయాలను అందించారు. తాత ఆశయాలను ఆదర్శంగా తీసుకొని తన తండ్రి మల్లికార్జున అండతో పలు సేవా కార్యక్రమంలను చేపడుతున్నట్లు చెప్పారు. సమాజం లో సేవ చెయ్యడమే పరమార్ధం అని ఇరువురు సోదరులు అన్నారు. ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమంలను చేపట్టి తాతకు ఘనంగా నివాళులు అర్పించి ఆయన మార్గంలోనే నడుచుకోవడం తమ అదృష్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో విడవలూరులో సిపిఎం నేత తుల్లూరు గోపాల్, పాశం శ్రీహరి రెడ్డి, స్థానికులు తదితరులు ఉన్నారు.


## పల్లా వివాహ వార్షికోత్సవ వేడుకల్లో పోలంరెడ్డి దినేష్ రెడ్డి





**గాజువాక, (రాజధాని వార్తలు):** గాజువాక శాసనసభ్యులు, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు వివాహ వార్షికోత్సవ సందర్భంగా రాష్ట్ర ఏ పి ఈ ఎం సి ఎల్ చైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి తాడేపల్లిలోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని మనస్ఫూర్తిగా తాను ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ని కూడా మర్యాద పూర్వకంగా కలవడం జరిగిందన్నారు.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ, చంద్ర శేఖర్ రెడ్డి, పేర్నిటి కోటేశ్వర రెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వైసీపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నేటి కోటేశ్వర రెడ్డి, శాసనమండలి సభ్యులు మరియు వైఎస్ఆర్సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇంచార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో కలిసి మాజీ ముఖ్యమంత్రి మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. పార్టీ బలోపేతం గురించి చర్చించుకొన్నారు.

## ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు కొమరగిరిపట్నం యువకుడు ఎంపిక

### - మిలటరీ కాలనీ నుండి మళ్లీ దేశ రక్షణకు
### - జోయల్ వెస్లీకి అభినందనల వెల్లువ

**అల్లవరం, (రాజధాని వార్తలు):** రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న ఘనత ఆ కాలనీ వాసులది. ఒకరు కాదు ఇద్దరు కాదు సుమారు 116 ఆ కాలనీకి చెందిన వారు రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. వారు రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నందుకు గాను ప్రభుత్వం వారికి మాగాని భూమితో పాటు నివాసం ఉండేందుకు నివాస స్థలాలు కేటాయించింది. అందుకనే వారి కాలనీకి మిలటరీ కాలనీ అని పేరు వచ్చింది. అయితే ప్రభుత్వం యువకులను దేశ రక్షణ నిమిత్తం ఎంపిక చేస్తున్న అగ్నివీర్ ఎంపికలో మిలటరీ కాలనీకి చెందిన ఓ యువకుడు ఇండియన్ ఎయిర్ఫోర్స్‌కు ఎంపికై మిలటరీ కాలనీ పేరును సార్ధకం చేశాడు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామంలో ఈ మిలటరీ కాలనీ ఉంది. ప్రతిష్టాత్మక ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్‌కు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నం మిలటరీ కాలనీకు చెందిన యువకుడు ఎంపిక అయ్యాడు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ –వై (y) కేడర్‌కు ఈద జోయల్ వెస్లీ(18) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఏకైక అభ్యర్థిగా ఎంపిక అవ్వడం విశేషం. కర్ణాటకలోని బెల్గావి ఎయిర్‌మెన్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆరు నెలల శిక్షణ అనంతరం జోయల్‌కు పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 7000 మంది వరకు అభ్యర్థులు పోటీ పడగా వీరిలో కేవలం 98 మంది మాత్రమే ఎంపిక అయ్యారు. వారిలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి జోయల్ వెస్లీ ఎంపిక అయ్యాడు. జోయల్ వెస్లీ తండ్రి ఈద ప్రసాద్ (చంటి) సాధారణ ప్రయివేటు ఉద్యోగి కాగా తల్లి ఝాన్సీలక్ష్మీ అంగన్వాడీ వర్కర్‌గా పనిచేస్తోంది. జోయల్ వెస్లీ తాతయ్య పిల్లి ఆనందం కూడా మిలటరీలో పనిచేయడంతో త్రివిధ దళాల్లో తనకు ఇష్టమైన ఎయిర్ ఫోర్స్‌లో పనిచేయాలన్న ఆకాంక్ష తనకు చిన్ననాటి నుంచే ఉండేదని, అదేవిధంగా



మామయ్య అయిన సవల రాజా కూడా కానిస్టేబుల్‌గా పనిచేయడంతో ఆయనను చూసి తనలో మరింత స్ఫూర్తిని తీసుకు వచ్చిందని జోయల్ వెస్లీ తెలిపాడు. భవిష్యత్తులో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఉన్నత స్థితికి చేరుకోవడమే తన లక్ష్యం అని వెల్లడించాడు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు జోయల్ వెస్లీ ఎంపిక కావడంపై స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు గ్రామస్తులు జోయల్ వెస్లీకి, తల్లితండ్రులకు అభినందలు తెలిపారు.

## త్రాగునీటి ఇబ్బందిలో జగనన్న కాలనీ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట - జి.రాగంపేట రోడ్డులో గల జగనన్న కాలనీలో సుమారు 15 రోజులుగా త్రాగు నీటి ఇక్కట్లకు గురవుతున్నట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీ వాటర్ ట్యాంకుకు ఉన్న మోటారు కాలి పోవడంతో దాని స్థానంలో అధికారులు మోటార్లు ఏర్పాటు చేయలేదని, దీంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రజలు తెలిపారు. త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక తెలుగుదేశం నాయకులకు వివరించడం జరిగిందన్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాల మేరకు జగనన్న కాలనీ ప్రాంత ప్రజల కోసం ట్యాంకర్ ద్వారా మంచినీటి సరఫరా చేపట్టి నట్లు గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ తెలిపారు. శ్రీకాంత్ సహకారంతో మంచినీళ్లు లభించినట్లు స్థానికలు తెలిపారు. పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

## "వెన్నుపోటు పాలన" పోస్టర్ ఆవిష్కరణ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజకవర్గ వైఎస్ ఆర్ సీపీ ఇంచార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో "చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు" పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా వెన్నుపోటు పాలన పోస్టర్‌ను సామర్లకోట పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచి పాలన ప్రారంభించి రెండు సంవత్సరాలు గడుస్తున్న కారణంగా ప్రజలు అనుభవిస్తున్న కష్టాలకు అండగా నిలుస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 4న మండల కేంద్రాల్లో, ప్రధాన కూడళ్లలో తెదేపా మేనిఫెస్టో, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సంతకాలు చేసిన బాండ్లు, పత్రికా ప్రకటనల కాపీల దహనం, 8,9 తేదీల్లో నియోజకవర్గ కేంద్రాల్లో "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో టౌన్ హాల్ సదస్సులు, 12 న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు పాలనకు నిరసనగా భారీ ర్యాలీలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఊబా జాన్ మోసెస్, నెక్కంటి సాయి ప్రసాద్, పట్టణ అధ్యక్షులు పాగా సురేష్ కుమార్, రాష్ట్ర అయ్యారాక కార్పొరేషన్ నాయకులు ఆవాల లక్ష్మినారాయణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపేని రూప, పట్టణ మహిళా అధ్యక్షురాలు పాలిక కుసుమ, నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెదకొత్తూరు సమీపంలో కారు దగ్ధం

### - హెచ్చరించిన వాహనదారులు..
### ప్రాణాలు కాపాడుకున్న ప్రయాణికులు



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ– రావులపాలెం ప్రధాన రహదారిపై కరప మండలం పెదకొత్తూరు సమీపంలో బుధవారం ఓ కారు అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం మేరకు, కాకినాడ నుంచి రావులపాలెం వైపు ఓ మహిళ, ఇద్దరు పిల్లలతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా పెదకొ త్తూరు సమీపానికి చేరుకున్న సమయంలో వాహనం కింద నుంచి మంటలు చెలరేగాయి. అయితే డ్రైవర్ తొలుత మంటలను గమనించలేదు. అదే మార్గంలో వెళ్తున్న ఇతర వాహనదారులు మంటలను గుర్తించి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. దీంతో డ్రైవర్ వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కకు నిలిపి కారులో ఉన్న వారం దరినీ సురక్షితంగా బయటకు దించాడు. అనంతరం అగ్నిమాపక శాఖ, కరప పోలీసులకు సమాచారం అందించారు. కొద్దిసేపటికే మంటలు వేగంగా వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. ఘటన సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, కరప ఎస్ఐ తోట సునీత, ఏఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారు దగ్ధానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పెద్ది రిలీజ్.. తిరుమల శ్రీవారిని దర్శించిన జాన్వీ కపూర్



సెలబ్రిటీలు తమ జీవితంలో ఏదైనా ప్రత్యేకమైన సందర్భం ఉందంటే కచ్చితంగా తమకు ఇష్టమైన దైవాన్ని ఆరాధిస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలోనే దేవాలయాలను సందర్శిస్తూ ఉంటారు. అలా ఇప్పటికే ఎంతోమంది సెలబ్రిటీలు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సందర్శించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు మరో బ్యూటీ తిరుమలలో సందడి చేసింది. ఆమె ఎవరో కాదు ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్. నేడు ఆమె నటించిన పెద్ది సినిమా విడుదల కావడంతో సినిమా పెద్ద సక్సెస్ కావాలని ఆకాంక్షిస్తూ.. కుటుంబంతో కలిసి స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకుంది. ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అమ్మడి లేటెస్ట్ లుక్ చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. పెద్ది విడుదల.. అసలు విషయంలోకి వెళ్తే .. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం పెద్ది. శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలకపాత్రను పోషించిన ఈ సినిమా నిన్న రాత్రి ప్రీమియర్ షోలతో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల అయింది..సుకుమార్ రైటింగ్స్, మైత్రి మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది. శ్రీవారిని దర్శించుకున్న జాన్వీ కపూర్.. అలాంటి ఈ సినిమా బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకోవాలని స్వామివారిని కోరుకోవడానికి జాన్వీ కపూర్ తిరుపతి వెళ్ళినట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడ అందర్నీ ఆశ్చర్యపరిచే విషయం ఏమిటంటే.. ఆమె కాలినడకన స్వామి వారిని చేరుకుంది. అలిపిరి మెట్ల మార్గంలో నడుచుకుంటూ తిరుమలకు చేరుకుంది. మొత్తం 3,550 మెట్లు ఎక్కి స్వామి వారిపై తనకున్న భక్తిని చాటుకుంది. ముఖ్యంగా మెట్ల మార్గంలో జాన్వీ కపూర్ వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఆ సమయంలో ఆమె సాధారణ గులాబీ రంగు ఎత్నిక్ సూట్ ధరించి కనిపించింది. పట్టు వస్త్రాలలో సంప్రదాయంగా..తిరుమల చేరుకున్న జాన్వీ కపూర్ స్వామి వారి దర్శనం అనంతరం బయటకు వచ్చింది. ఇక ఈమె లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇక అందులో సాంప్రదాయంగా పర్పుల్ కలర్ పట్టు చీరలో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా నడుముకు వడ్డానం పెట్టుకొని మెడకు చౌకర్ ధరించి తన అందాలను రెట్టింపు చేసుకుంది. మొత్తానికి అయితే జాన్వి కపూర్ లేటెస్ట్ లుక్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుందని చెప్పవచ్చు. సడన్ సర్ప్రైజ్ ఇచ్చిన మహేశ్వరి.. ఇకపోతే ఇక్కడ జాన్వి కపూర్ మాత్రమే కాదు ఆమె కుటుంబ సభ్యులు, ప్రముఖ హీరోయిన్ మహేశ్వరి కూడా జాన్వికపూర్ తో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. చాలా రోజుల తర్వాత మహేశ్వరి కూడా మీడియా కంట పడడంతో ఆమె అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే జాన్వీ కపూర్ శ్రీవారిని దర్శించుకోవడం ఇదేమి మొదటిసారి కాదు.. ఆమె తల్లి పుట్టిన రోజు, అలాగే ఆమె పుట్టినరోజు సందర్భంగా కూడా తిరుమల శ్రీవారిని దర్శిస్తూ ఉంటుంది. మొత్తానికైతే జాన్వీ కపూర్ కోరిక నెరవేరాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# టెలివిజన్ రంగంలో వివాదాలు!





టెలివిజన్ రంగం నిరంతరం సరికొత్త కథనాలతో ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. కానీ తెరవెనుక జరిగే వివాదాలు సమాజంలో అంతకుమించి పెద్ద ఎత్తున చర్చకు దారి తీస్తున్నాయి. ప్రముఖ సీరియల్ భాబీజీ ఘర్ పర్ హై నిర్మాతలపై నటి శిల్పా షిండే చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు.. అటుపై చోటుచేసుకున్న పరిణామాలు బుల్లితెరపై తీవ్ర కలకలం రేపాయి. ఈ నేపథ్యంలో వీటిపై ప్రముఖ నటి హినా ఖాన్ స్పందించారు. తప్పుడు ఆరోపణలు చేయడం వల్ల సమాజంలో ఎలాంటి ప్రతికూల ప్రభావాలు ఉంటాయో? బహిరంగంగా వ్యక్తం చేయడం పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శిల్పా షిండే సీరియల్ నిర్మాతపై చేసిన ఆరోపణలు ఒకానొక సమయంలో చట్టపరమైన, సామాజిక పరమైన చర్చలకు కేంద్ర బిందువుగా మారాయి. మహిళా రక్షణకు సంబంధించిన చట్టాలను వృత్తిపరమైన విభేదాల కోసం..వ్యక్తిగత కక్షల కోసం వాడుకోవడం సరైన పద్ధతి కాదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ ఉదంతాన్ని ప్రస్తావిస్తూ,– హినా ఖాన్ తోటి నటి వైఖరిని తప్పుపట్టడం, ప్రచారం కోసం చట్టాలను ఆయుధాలుగా మార్చు కోకూడదని సూచించడం విశేషం. ఒక మహిళ తనపై జరిగిన అన్యాయాన్ని ఎదిరించడానికి చట్టాన్ని ఆశ్రయించడం ఎంతో అవసరమని.. అయితే అదే చట్టాన్ని అబద్ధపు ఆరోపణల కోసం వాడితే అది సమాజానికి ఎంతో హాని చేస్తుందని హినా ఖాన్ అభిప్రాయపడ్డారు. తప్పుడు కేసులు నమోదు చేయడం వల్ల భవిష్యత్తులో నిజంగానే వేధింపులకు గురై న్యాయం కోసం పోరాడే ఇతర మహిళల మాటలను సమాజం నమ్మే అవకాశం తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు నిజమైన బాధితుల సుదీర్ఘ పోరాటాన్ని బలహీనపరుస్తాయని స్పష్టం చేశారు. చలనచిత్ర, టెలివిజన్ పరిశ్రమలలో నిర్మాతలు, నటీనటుల మధ్య వృత్తిపరమైన సంబంధాలు ఎంతో సున్నితమైనవి. విభేదాలు వచ్చినప్పుడు వాటిని చర్చల ద్వారా లేదా చట్టబద్ధమైన వేదికలపై పరిష్కరించుకోవాలి తప్ప నేరారోపణలను సులభంగా వాడటం వల్ల ఇండస్ట్రీ ప్రతిష్ట దెబ్బతింటుంది. హినా ఖాన్ చేసిన ఈ వ్యాఖ్యలు పరిశ్రమలోని పని వాతావరణంలో పరస్పర నమ్మకం, బాధ్యతాయుతమైన ప్రవర్తన ఎంత ముఖ్యమో అందరికీ గుర్తు చేస్తున్నాయి. సెలబ్రిటీలుగా సమాజంలో కోట్లాది మందిపై ప్రభావం చూపే వ్యక్తులు మాట్లాడే ప్రతి మాట, తీసుకునే ప్రతి నిర్ణయం ఎంతో బాధ్యతాయుతంగా ఉండాలి.


ఒక నటిగా తోటి నటి చేసిన తప్పుడు విధానాన్ని నిర్భయంగా ప్రశ్నించడం ద్వారా హినా ఖాన్ సామాజిక బాధ్యతను చాటుకున్నారని చాలామంది విశ్లేషకులు భావిస్తున్నారు. పరిశ్రమలో కేవలం గ్రూపు రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా నిజానిజాల వైపు నిలబడటం ఆరోగ్యకరమైన వాతావరణానికి సంకేతం. టెలివిజన్ రంగంలో ఇలాంటి వివాదాలు రేటింగులు, వ్యక్తిగత ప్రతిష్టల చుట్టూ తిరగకుండా, వ్యవస్థాగత మార్పులకు దారితీయాలి. చట్టాలను రక్షణ కవచాలుగా వాడుకోవాలే తప్ప ఇతరులను వేధించే ఆయుధాలుగా మార్చకూడదనే సందేశం ఈ వివాదం ద్వారా స్పష్టమవుతోంది. భవిష్యత్తులో ఇండస్ట్రీలో మరింత పారదర్శకమైన, సురక్షితమైన పని వాతావరణం ఏర్పడటానికి ఇలాంటి బహిరంగ చర్చలు, నిజాయితీతో కూడిన అభిప్రాయాలు ఎంతో దోహదపడతాయి.

# నెక్స్ట్ మూవీ.. ధనుష్ డెసిషన్‌కు రీజనేంటి?



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరోసారి తన ప్లాన్‌తో వార్తల్లో నిలిచారు. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా, గాయకుడిగా ఆకట్టుకుంటున్న ఆయన ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. అయితే తాజాగా ఆయన తీసుకున్న నిర్ణయం కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే ప్రకటించిన ఓ ప్రాజెక్టును మరో నిర్మాణ సంస్థ నుంచి తన సొంత బ్యానర్‌కు మార్చడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొన్ని నెలల క్రితం దర్శకుడు తమిళరసన్ పచ్చ ముత్తుతో కలిసి ధనుష్ కొత్త సినిమా చేయనున్నట్లు అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చింది. లబ్బర్ పందు సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న తమిళరసన్.. ధనుష్ కెరీర్‌లో 57వ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు ప్రకటన వెలువడింది. దీంతో ఆ ప్రాజెక్టుపై అభిమానుల్లో కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఆ సినిమాను మొదట డాన్ పిక్చర్స్ నిర్మించాల్సి ఉంది. హీరోయిన్‌గా రుక్మిణి వసంత్, నటుడు విజయ్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. కథకు తగ్గట్టు పలు ప్రాంతాల్లో లొకేషన్ రెకీ కూడా నిర్వహించినట్లు రీసెంట్‌గా మూవీ టీమ్ తెలిపింది. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందని అందరూ భావించారు. అయితే అనూహ్యంగా ఆ ప్రాజెక్టుకు సంబంధించిన పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందాల్సిన కొన్ని సినిమాలు వివిధ కారణాలతో ఆలస్యం అవుతున్నాయని కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ధనుష్-తమిళరసన్ సినిమా కూడా అదే పరిస్థితి ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయని వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో ధనుష్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సినిమా నిర్మాణ బాధ్యతలను తన సొంత సంస్థ వండర్ బార్ ఫిల్మ్స్‌కు మార్చినట్లు సమాచారం. ప్రాజెక్ట్ లేట్ కాకుండా, అనుకున్న సమయానికి షూటింగ్ పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలన్న ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అయితే ధనుష్ కెరీర్‌ను పరిశీలిస్తే.. కథల సెలక్షన్‌లో ఆయన ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తారన్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు కెరీర్‌లో పలు కమర్షియల్ సినిమాలు కూడా చేసినప్పటికీ, స్ట్రాంగ్ కంటెంట్ ఉన్న కథలకు ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తుంటారు. అందుకే తమిళరసన్ చెప్పిన కథపై ఆయనకు పూర్తి నమ్మకం ఉందని, ప్రాజెక్టు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగాలనే ఉద్దేశంతో నిర్మాణ సంస్థను మార్చినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ప్రస్తుతం ధనుష్ చేతిలో అనేక ప్రాజెక్టులు ఉండటంతో, ఒక మూవీ లేట్ అయితే ఆ ఎఫెక్ట్ ఆయన ప్లానింగ్‌పై కచ్చితంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే తమిళరసన్ పచ్చ ముత్తుతో చేస్తున్న ప్రాజెక్టుపై ధనుష్‌కు ఉన్న నమ్మకమే ఆయన నిర్ణయానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అదే సమయంలో ఆ విషయంలో అఫీషియల్ అనౌన్స్మెంట్ రావాల్సి ఉన్నప్పటికీ.. సినిమా త్వరలోనే కొత్త జోష్‌తో పట్టాలెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరేం జరుగుతుందో అంతా వేచి చూడాలి.

# చరణ్ తప్ప ఎవరు న్యాయం చేయలేరేమో.. నేషనల్ అవార్డు గ్యారెంటీ?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన పాన్ ఇండియా మూవీ పెద్ది థియేటర్స్‌లో సందడి చేస్తోంది. రిలీజ్‌కు ముందు వరకు సినిమా కథ, బుచ్చిబాబు సనా దర్శకత్వం, స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ వంటి విషయాలపై చర్చ జరిగినా.. సినిమా చూసిన తర్వాత ఎక్కువ మంది మాట్లాడుకుంటున్న విషయం మాత్రం రామ్ చరణ్ నటన గురించే. పెద్దిలో రామ్ చరణ్ కేవలం హీరోగా కనిపించలేదు.. పాత్రలో జీవించేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సినిమా మొత్తం ఆయన తన పాత్రలో పూర్తిగా ఒదిగిపోయిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా సినిమాలోని పాత్ర కోసం ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్‌పై పెద్దఎత్తున ప్రశంసలు వస్తున్నాయి. చరణ్ మల్టీపుల్ యాంగిల్స్‌లో కనిపించారని ప్రేక్షకులు చెబుతున్నారు. కూలీగా కనిపించే సన్నివేశాల నుంచి స్పోర్ట్స్ ప్లేయర్ రోల్ వరకు ఆయన చూపించిన వేరియేషన్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచిందనే అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా కుస్తీ బ్యాక్ డ్రాప్‌లో వచ్చే సీన్స్ కోసం ఆయన హార్డ్ వర్క్ స్క్రీన్‌పై క్లియర్‌గా కనిపిస్తోందని అంటున్నారు. నిజానికి స్పోర్ట్స్ డ్రామాల్లో బాడీ చేంజ్‌కు ఎంతో ఇంపార్టెన్స్ ఉంటుంది. ఆ విషయంలో రామ్ చరణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది. కేవలం లుక్ మార్చుకోవడమే కాకుండా, పాత్రకు అవసరమైన ఎక్స్ప్రెషన్స్, వాకింగ్ స్టైల్, మాట్లాడే తీరు వంటి అంశాల్లోనూ భిన్నంగా కనిపించారని ప్రేక్షకులు పేర్కొంటున్నారు. అందుకే ఆ రోల్ నుమరో హీరో చేస్తే ఇదే ఎఫెక్ట్ వచ్చేదా అనే చర్చ సాగుతోంది. ఎమోషనల్ సీన్స్‌లో చరణ్ యాక్టింగ్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. యాక్షన్, స్పోర్ట్స్ సీన్స్‌లో తన పవర్‌ను చూపించిన ఆయన.. ఎమోషనల్ సీన్స్‌లోనూ బాధను నేచురల్‌గా వ్యక్తపరిచారట. ముఖ్యంగా క్లైమాక్స్‌లో ఆయన యాక్టింగ్ ప్రేక్షకులను ఫిదా చేస్తోంది. కమర్షియల్ హీరోగా ఇప్పటికే మంచి గుర్తింపు ఉన్న రామ్‌చరణ్.. ఇలాంటి కథను నమ్మి చేయడం గ్రేట్ అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మాస్ ఎలిమెంట్స్‌కు మాత్రమే పరిమితం కాకుండా, రోల్‌కు ఇంపార్టెన్స్ ఉన్న కథను ఎంచుకోవడం ఆయన కెరీర్‌లో కీలక నిర్ణయంగా మారవచ్చని సినీ ఎక్స్పర్ట్స్ భావిస్తున్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించండి





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని తుమ్మికాపల్లి, ముచ్చర్ల, వేమలి, సీతారాంపురం, కె.ఎస్.ఆర్.పురం గ్రామలలో ఐ.సి.డి.ఎస్ ఆధ్వర్యంలో బుధవారం అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి రాజేశ్వరి ఆదేశాల మేరకు సూపర్వైజర్ జానకి పర్యవేక్షణలో అంగన్వాడీ కార్యకర్తలు గ్రామాలలో అవగాహన ర్యాలీ చేపట్టారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని, పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతోపాటు పాలు, గుడ్డు, పోషక విలువలతో కూడిన భోజనం అందించడం జరుగుతుందని అంగన్వాడి కార్యకర్తలు చెప్పారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుభాషిణి, జయలక్ష్మి, శ్రీదేవి, వరలక్ష్మి, ఊర్మిళ, ఈశ్వరమ్మ, పాపయ్యమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో వేగం పెంచాలి

## - పూసపాటిరేగ, నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి





**విజయనగరం/పూసపాటిరేగ/నెల్లిమర్ల, (రాజధాని వార్తలు):** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పూసపాటిరేగ మండలం వెనుకబడిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి బుధవారం పూసపాటిరేగ, నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో జరుగుతున్న పనితీరును పరిశీలించిన కలెక్టర్, నమోదు ప్రక్రియలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. సిబ్బంది పని విధానాన్ని పరిశీలిస్తూ, ఎలాంటి పొరపాట్లు లేకుండా సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సంబంధిత యాప్‌ను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, యాప్‌ను ఎలా సమర్థవంతంగా వినియోగించాలి, వివరాలను ఎలా నమోదు చేయాలి అనే అంశాలపై అధికారులకు, సిబ్బందికి వివరించారు. ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. నెల్లిమర్ల మండలంలో కూడా రివిజన్ ప్రక్రియ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, అధికారులు క్షేత్రస్థాయిలో మరింత సమన్వయంతో పనిచేయాలని, నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని దిశ, నిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో పూసపాటిరేగ తాసిల్దార్ ఎన్ వెంకటరమణ, నెల్లిమర్ల తాసిల్దార్ డి శ్రీకాంత్, ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# అరాచక పాలనకు ముగింపు పలికిన ప్రజా ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తి

## - స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా వేగంగా అడుగులు - రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు

**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అరాచకాలు, అవినీతి, విధ్వంసకర విధానాలకు ప్రజలు ముగింపు పలికి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన చారిత్రక సందర్భానికి నేటితో రెండేళ్లు పూర్తయ్యాయని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా పారదర్శక పరిపాలన, అభివృద్ధి, సంక్షేమం అనే మూడు ముఖ్య లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పాలనలో రాష్ట్రం ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక రంగాల్లో వెనుకబడిందని, ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర పునర్నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి ప్రధాన బలం అని పేర్కొంటూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. "స్వర్ణాంధ్రప్రదేశ్" లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన ఆయన, ప్రజల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. "ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి



చేసుకోవడం ఆనందదాయకం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో స్వర్ణాంధ్ర సాధన కోసం అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం" అని సానా సతీష్ బాబు పిలుపునిచ్చారు.

# ఆర్డీఓను మర్యాద పూర్వకంగా కలిసిన ఈవో



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం ఆర్డీవో, పెద్దాపురం మున్సిపల్ ప్రత్యేక అధికారి అయిన పి కృష్ణమూర్తిని అమ్మవారి ఆలయం కార్యనిర్వహణ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్డీవో కార్యాలయంలో ఆలయ సిబ్బంది, అర్చకులతో కలిసి ఆలయ అధికారి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటాన్ని, ప్రత్యేక ప్రసాదాలను ఆర్డీవోకు ఆమె అందజేశారు. అనంతరం ఆయనకు పండితే ఆశీర్వచనాలు అందజేశారు.

# జల రవాణా మార్గాల్లో ఎలక్ట్రిక్ రివర్ మెట్రో పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించండి

## - క్వాంటమ్ వ్యాలీ ఫ్రేమ్ వర్క్‌లో భాగస్వామ్యం వహించండి - సిస్టమా ప్రెసిడెంట్ తాగిర్ సిట్ దేకోవ్‌తో భేటీలో ఏపీ మంత్రి నారా లోకేష్







**సెయింట్ పీటర్స్ బర్గ్ (రష్యా):** రష్యాకు చెందిన ప్రముఖ బహుళజాతి పెట్టుబడి సంస్థ సిస్టమా ప్రెసిడెంట్ తాగిర్ సిట్ దేకోవ్‌తో ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సెయింట్ పీటర్స్ బర్గ్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... భారత్‌లో అంతర్గత జలరవాణా, స్మార్ట్ ఫ్లీట్ నిర్వహణ కోసం జాతీయ జలరవాణా మార్గాల్లో ఒక ఎలక్ట్రిక్ రివర్ మెట్రో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించండి. ప్రధాన ఓడరేవుల్లో ఒకచోట అసెంబ్లింగ్ సదుపాయాలను ఏర్పాటుచేసే అవకాశాలను పరిశీలించండి. భారత్ లో పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు అనుగుణంగా భారీపరిశ్రమల అవసరాల కోసం గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా పైలట్ ప్రాజెక్టును అభివృద్ధి చేయండి. భారత్‌లోని ఇస్రో మౌలిక సదుపాయాల సమీపంలో రాబోయే హైటెక్ క్లస్టర్లలో ఒక జాయింట్ స్మాల్ శాటిలైట్, గ్రౌండ్ స్టేషన్ సదుపాయాన్ని నిర్మించండి. అటానమస్ సీ షిప్ యార్డు, తీరప్రాంత పర్యవేక్షణ కోసం ఏఐ విశ్లేషణలకు సహకారం అందించండి. భారతదేశం అంతటా స్మార్ట్ ఈవి చార్జింగ్ నెట్ వర్క్‌లు, డేటా ప్లాట్ ఫారమ్‌లను ఏర్పాటు చేయండి. దక్షిణ భారతదేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్మాణరంగ మార్కెట్‌లో సేవలు, ఆంధ్రప్రదేశ్ పోర్టుల ద్వారా వచ్చే ముడిసరుకు దిగుమతులను ఉపయోగించి సిమెంట్, వ్యవసాయ రంగాల కోసం కాగితపు ప్యాకేజింగ్ ఉత్పత్తుల తయారీ, లోకలైజేషన్ కు సహకరించండి. క్వాంటమ్ వ్యాలీ ఫ్రేమ్ వర్క్ కింద అనుసంధానమైన అధునాతన సైబర్ సెక్యూరిటీ, బయోమెట్రిక్ వ్యవస్థలు, ఎఐ ఆధారిత పట్టణ పరిపాలన సాధనాలను భారతదేశం అంతటా అమలు చేయడంలో భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

సిస్టమా ప్రెసిడెంట్ తాగిర్ సిట్ దేకోవ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ ప్రాంతాల్లో డిజిటల్ ఎకోసిస్టమ్, లెండింగ్ కార్ట్ ఎస్ఎంఇ ఫైనాన్సింగ్, టెక్ ఆధారిత సప్లయ్ చైన్ వంటి పెట్టుబడి మద్దతు సేవలను తాము




ఇప్పటికే అందిస్తున్నామని చెప్పారు. భారత్‌లోని న్యూఢిల్లీ శాఖ ద్వారా సిస్టమా వెంచర్ క్యాపిటల్ విభాగం గ్రోత్ క్యాపిటల్, మార్కెట్ విస్తరణ, నెట్ వర్క్ లను వినియోగించి పెట్టుబడుల కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఫిన్ టెక్, హెల్త్ టెక్, కన్వర్సేషనల్ ఎఐ రంగాల్లో స్టార్టప్‌లకు తమ సంస్థ నిధులు సమకూరుస్తుంది. గ్రోత్ ఈక్విటీ వ్యూహంలో భాగంగా లిషియస్, రెబల్ ఫుడ్స్, రెండింగ్ కార్ట్ వంటి కొత్తతరం మార్కెట్ లీడింగ్ సంస్థల్లో సంస్థాగత మూలధనాన్ని పెట్టుబడిగా పెడుతున్నాం. భారత్‌లోని విభిన్న రంగాల్లో క్రాస్ బోర్డర్ మార్కెట్ ఇంటిలిజెన్స్, ఆర్థిక స్థిరత్వంతో కూడిన కార్యకలాపాలకు భారత్ లో మద్దతు ఇస్తున్నాం. ఏపీ మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని సిస్టమా ప్రెసిడెంట్ తాగిర్ సిట్ దేకోవ్ హామీ ఇచ్చారు. సిస్టమా సంస్థ గురించి.. సిస్టమా సంస్థ టెలికం, ఈ-కామర్స్, టింబర్, హెల్త్ కేర్ రంగాల్లో రష్యాలోని అతిపెద్ద ప్రైవేట్ ఉద్యోగ కల్పన సంస్థల్లో ఒకటి. 80 మిలియన్లకు పైగా టెలికాం కస్టమర్లు, లక్షలాది డిజిటల్ వినియోగదారులకు సేవలు అందిస్తోంది.

# అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌కు విచ్చేసిన అనిమిని రవి నాయుడు





**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఈరోజు VIT-AP విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. VIT-AP ప్రథమ అమరావతి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ నాలుగో రోజు సందర్భంగా ఆయన విశ్వవిద్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా VIT-AP విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి. అరుళ్మొళివర్మన్‌తో కలిసి చెస్ ఆడిన రవి నాయుడు అంతర్జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక చెస్ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇస్తున్నందుకు విశ్వవిద్యాలయాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ ఎస్.సంతోష్ కుమార్ ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా VIT-AP విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి.అరుళ్మొళివర్మన్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి, విద్యార్థి సంక్షేమ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖదీర్ పాషా, ఆంధ్ర చెస్ అసోసియేషన్ చైర్మన్ కె.వి.వి.శర్మ అధ్యక్షులు డాక్టర్ సురేష్, కార్యదర్శి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల్లో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించాలి

## - వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం

**అమరావతి, (రాజధాని వార్తలు):** వచ్చే ఏడాది జూన్‌లో జరగనున్న పవిత్ర గోదావరి పుష్కరాల్ని పురస్కరించుకుని వైద్య సేవల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ముఖ్యంగా నేత్ర వైద్య శిబిరాల్ని నిర్వహించాలని స్పష్టంచేశారు. 'ఆంధ్రప్రదేశ్ రైట్ టు సైట్ సొసైటీ' గవర్నింగ్ బాడీ సమావేశం వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో 11 ఏళ్ల అనంతరం తొలి సారిగా మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన గురువారం జరిగింది. దీనికి సీఎం చైర్మన్‌గా ఉన్నారు. వైస్-ఛైర్మన్‌గా ఉన్న మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ పారా మెడికల్, ఆప్తాల్మిక్ ఖాళీల భర్తీకి ప్రాంతీయ సంచాలక కార్యాలయాలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖాళీల భర్తీకి జీరో వేకెన్సీ విధానాన్ని వర్తింప చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే.. పారా మెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు నిర్వహణ, రిజిస్ట్రేషన్ల నిర్వహణ గురించి విపులంగా ఈ సమావేశంలో చర్చించారు. జాతీయ అంధత్వ నియంత్రణ, దృష్టిలోపాల నివారణ కార్యక్రమాల అమలు పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. వైద్య సేవలు ఇంకా మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టంచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లాలో 'ఆపరేషన్ వజ్రప్రహార్'... గబ్బడ గ్రామంలో భారీ కార్డన్ అండ్ సెర్చ్

## - సరైన పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలు, 2 కార్లు స్వాధీనం - ముగ్గురు గంజాయి వినియోగదారుల గుర్తింపు
## - గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం : నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు







**నర్సీపట్నం, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, గంజాయి నిర్మూలనకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నర్సీపట్నం రూరల్ సర్కిల్ సీఐ ఎల్.రేవతమ్మ, సర్కిల్ ఎస్సైలు రాజారావు, దామోదర్ నాయుడు, తారకేశ్వరరావు, రామారావు, రిషికేశ్వర రావు దాదాపు 70 మంది పోలీస్ సిబ్బందితో కలిసి బుధవారం తెల్లవారుజామున నర్సీపట్నం మండలం గబ్బడ గ్రామంలో భారీ 'కార్డన్ అండ్ సెర్చ్' నిర్వహించారు. 'ఆపరేషన్ వజ్రప్రహార్'లో భాగంగా చేపట్టిన ఈ తనిఖీల్లో వాహనాల స్వాధీనం సరైన ధృవీకరణ పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలను, 2 కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి వినియోగదారుల గుర్తింపు కోసం గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తూ, గంజాయి తాగుతూ పట్టుబడిన ముగ్గురు (3) వ్యక్తులను గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టారు. గ్రామస్థులతో అవగాహన సదస్సు నిందితులకు హెచ్చరిక. సోదాల అనంతరం నర్సీపట్నం ఎస్డీపీఓ పోతిరెడ్డి శ్రీనివాసరావు గబ్బడ గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనకాపల్లి జిల్లాను పూర్తిగా గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. యువత మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఇదే సమయంలో గతంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన పాత నేరస్థులను, అనుమానితులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, లేదా సహకరించినా వారిపై కఠినమైన పీడీ యాక్ట్ నమోదు చేస్తామని అలాగే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని నర్సీపట్నం డి.ఎస్.పి పోతిరెడ్డి శ్రీనివాసరావు గట్టిగా హెచ్చరించారు.

జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, మత్తు పదార్థాల విక్రేతలపై 'ఆపరేషన్ వజ్రప్రహార్' నిరంతరం కొనసాగుతుందని ఈ సందర్భంగా పోలీస్ అధికా రులు స్పష్టం చేశారు. గంజాయి లేదా ఇతర అసాంఘిక కార్యక లాపాలపై సమాచారం తెలిస్తే వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972/ 112/100 పోలీసులకు ఫిర్యాదు చేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచబడతాయని జిల్లా పోలీస్ యంత్రాంగం తెలిపింది.

# పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులలో అవగాహన కలిగించాలి

## - జూన్ 5న అన్ని పాఠశాలల్లో విస్తృతంగా మొక్కలు నాటాలి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్ర మాలను నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. 46 పాఠశాలల్లో గుంతలు తవ్వి మొక్కలు నాటాలని అందులో 43 పాఠశాలలు రూరల్ మండలాల్లోనూ మూడు పాఠశాలలు అర్బన్ మండలంలోనూ ఉన్నాయన్నారు. ఎన్.ఆర్.వి.జి.ఎస్ సహాయముతో మొత్తము గుంతలు తవ్వాలని 46 స్కూల్ ప్రిన్సిపల్ మరియు పిల్లలు పాల్గొని మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. సోషల్ వెల్ఫేర్, బిసీ వెల్ఫేర్, కేజీబీవీ రెసిడెన్షియల్ స్కూల్‌తో కలిపి 46 రకాల స్కూల్లో ఈ కార్యక్రమం ప్రారంభించాలని, ఎన్‌జిహెచ్ఎస్ ప్రోగ్రాంలో ఒక్కొక్క ఎన్జీవో హృదయపూర్వకముగా పనిచేయాలని పేర్కొన్నారు. అన్ని స్కూల్లోనూ, హాస్టల్లోనూ మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. విద్యార్థులు ఒక్కో మొక్కను దత్తత తీసుకుని సంరక్షించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలు, ఖాళీ స్థలాలు, ఆట స్థలాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మలాదేవి, బిసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె.శ్రీదేవి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.రామనాథం, బీసీ వెల్ఫేర్ స్కూల్స్ సోషల్ వెల్ఫేర్ స్కూల్స్ కేజీబీవీ స్కూల్‌ప్రిన్సిపల్‌పాల్గొన్నారు.

# వసతి గృహం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం

## - అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో మొత్తం 48 వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు నిర్వహించబడుతున్నాయని, ఈ వసతి గృహాల్లో విద్యార్థులకు ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు, వసతి, ఆరోగ్య పరిరక్షణతో పాటు నాణ్యమైన విద్య అందించబడుతోందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని, ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి జిల్లా స్థాయిలో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఈ విజయాలను దృష్టిలో ఉంచుకుని మరింత మంది విద్యార్థులు వసతి గృహాల్లో చేరి ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. వసతి గృహాల్లో ఉచిత వసతి, పోషకాహార భోజనం, ఉచిత ఆరోగ్య పరీక్షలు, మౌలిక సదుపాయాలు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# భద్రాచలంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్న ఎస్ఐ శ్యాంప్రసాద్ బృందం




**భద్రాచలం, (రాజధాని వార్తలు):** ఈ రోజు 03.06.2026 నాడు ఉదయం సమయంలో (డి ఎస్ పి) ఆదేశాల మేరకు భద్రాచలం పట్టణ ఎస్ఐ పి.శ్యాం ప్రసాద్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటుగా భద్రాచలం గోదావరి కరకట్ట, రెడ్డి సత్రం సమీప ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహించుచుండగా, ఇద్దరు వ్యక్తులు పోలీసు వారిని చూసి పారిపోవుటకు ప్రయత్నించగా వారిని పట్టుకొని విచారించగా వారి పేర్లు: వాడపర్తి సురేష్ మరియు షేక్ షఫీర్ పాషా ఏ సప్పు అని తెలిపినారు. ఇరు ఇద్దరు కూడా భద్రాచలంకు చెందిన వారే. వీరు ఇద్దరు గత కొంత కాలంగా గుర్తు తెలియని వ్యక్తుల నుండి గంజాయిని కొని భద్రాచలంలో మరియు భద్రాచలం చుట్టూ ప్రక్కల వారికీ గంజాయిని చిన్న చిన్న ప్యాకేట్లుగా చేసి లాభం పొందుతూ ఉండేవారు. వారిద్దరి వద్ద నుండి స్వాదినం చేసుకున్న సుమారు ఒక కేజీ బరువు గల గంజాయి 45,000 రూపాయల విలువ కలదు. వారిద్దరి వద్ద నుండి ఒక మోటార్ సైకిల్ ను మరియు 2 మొబైల్ ఫోన్‌లను స్వాదీన పరుచుకుని సీజ్ చేసి, పట్టుబడిన ఇద్దరు మగ వ్యక్తులను అదుపులోకి తీసుకొనగా, భద్రాచలం పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ బి.రామకృష్ణ కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం జైలుకు పంపడం జరిగింది. ఈమద్య కాలంలో భద్రాచలం ప్రాంతానికి చెందిన వారె ఎక్కువగా గంజాయిని త్రాగడం కాని, గంజాయి రవాణా చేయడం కాని జరుగుతుందని కావున తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని హెచ్చరించారు. ఈ సందర్భంగా భద్రాచలం డి.ఎస్.పి ఎవరైనా వ్యక్తులు ప్రభుత్వ నిషేదిత గంజాయిని అక్రమంగా రవాణా చేసే వారిపై మరియు గంజాయి త్రాగేవాల్లపై మరియు గంజాయి అక్రమ రవాణాకు సహాయం చేసిన వారిపై చట్టపరమయిన చర్యలు తీసుకుంటామని మరియు గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా, నిల్వ గురించి సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించగలరని, సమాచారం ఇచ్చిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని భద్రాచలం డి.ఎస్.పి తెలిపినారు.

# హైటెక్ కంపెనీలో మృతి చెందిన పిల్లి అప్పారావు కుటుంబాన్ని ఆదుకోవాలని కంపెనీ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన



**రాంబిల్లి, (రాజధాని వార్తలు):** రాంబిల్లి మండలం సెజ్ పరిధిలోని హైటెక్ డబ్బాల కంపెనీలో మంగళవారం ప్రమాదవశాత్తు మృతి చెందిన, పిల్లి అప్పారావు కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు, నాయకులు, మృతుని బంధువులు, గ్రామ పెద్దలు కంపెనీ ఎదుట ఆందోళనకు దిగారు. ఆందోళన సందర్భంగా కంపెనీ యాజమాన్యం దిగొచ్చి ప్రమాదవశాత్తు మృతి చెందిన పిల్లి అప్పారావు మృతుని కుటుంబానికి 15 లక్షల రూపాయలు ఆర్థికంగా నష్టపరిహారం చెల్లించుటకు, 50,000 దాన సంస్కారాలకి, మృతుని కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించుటకు యాజమాన్యం అంగీకరించింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జి.దేవుడు నాయుడు, ఆర్.రాము మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కంపెనీ యాజమాన్యం భద్రత ప్రమాణాలు పాటించే విధంగా, లేబర్ అధికారులు చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన, హైటెక్ కంపెనీ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వసంతవాడ దిన్ బాబు, ఉప్పులూరి నాయుడు, శివ, సిఐటియు నాయకులు కె.సోము నాయుడు, సిహెచ్.రామకృష్ణ, సిహెచ్.శివాజీ, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బీసీ నేత బొమ్మి నాగ కిషోర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీసీ నేతలు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** బీసీ సామాజిక వర్గాల ప్రజలకు అండగా ఉండి మానవతావాది అయిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బొమ్మి నాగకిషోర్ యాదవ్ జన్మదిన సందర్భంగా బీసీ నేతలు వెల్లువెత్తిన జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. నెల్లూరు జిల్లా భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు బుధవరపు బాలాజీ, రాష్ట్ర ఈసీ మెంబెర్ సోమవరపు గోపాల్ జిల్లా బీసీ వై పార్టీ యూత్ అధ్యక్షులు పామూరు హరనాథ్, బీసీ వై పార్టీ జిల్లా కో కన్వీనర్ సోమా అనూరాధ పలువురు బీసీలు కలిసి నాగ కిషోర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి భవిష్యత్తులో ఉన్నత పదవులను ఎన్నో అలంకరించాలని ఆకాంక్షించారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# విజయవాడలో ప్రెషర్ కుక్కర్ తయారీదారులపై బిఐఎస్ దాడులు





**విజయవాడ, (రాజధాని వార్తలు):** వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారతీయ ప్రమాణాల బ్యూరో, విజయవాడ శాఖ కార్యాలయం, మే 29న ప్రెషర్ కుక్కర్లు మరియు వాటికి సంబంధించిన భాగాల తయారీ, నిల్వలో నిమగ్నమైన రెండు యూనిట్లపై ఐఎస్ఐ మార్కు దుర్వినియోగం మరియు BIS చట్టం, 2016 ఉల్లంఘనల కారణంగా దాడులు నిర్వహించింది. ఈ దాడులు క్రింది ప్రాంగణాల్లో నిర్వహించబడ్డాయి:

1. ఘనశ్యామ్ అల్యూమినియం సర్వే నం. 159 & 163, గన్నవరం, సూరంపల్లి, కృష్ణా జిల్లా - 521212, BIS బృందం: షణ్ముఖ శివ పల్లి, శాస్త్రవేత్త-డి / సంయుక్త సంచాలకులు, డి.వివేక్ వర్ధన్ రెడ్డి, శాస్త్రవేత్త-సి / ఉప సంచాలకులు, ఎ.రాజు, (ఎస్ఎస్ఏ). 2. రామ్‌దేవ్ ఇండస్ట్రీస్ సర్వే నం. 411/3, ఇండస్ట్రియల్ ఏరియా, కబేళా సెంటర్, విజయవాడ, ఎన్.టి.ఆర్ జిల్లా - 520012. BIS బృందం: బి.రాజగోపాల్, శాస్త్రవేత్త--డి/ సంయుక్త సంచాలకులు, టి.అర్జున్, శాస్త్రవేత్త-డి / సంయుక్త సంచాలకులు, కె.సాయి కౌశిక్, శాస్త్రవేత్త-డి / సంయుక్త సంచాలకులు.

తనిఖీల సమయంలో, ఈ యూనిట్లు BIS చట్టం, 2016 నిబంధనల ఉల్లంఘనలు గుర్తించబడ్డాయి. ఈ ఉల్లం ఘనలకు సంబంధించిన ప్రెషర్ కుక్కర్లు మరియు ఇతర సంబం ధిత వస్తువులను BIS అధికారులు స్వాధీనం చేసుకున్నారు. క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ పరిధిలో ప్రెషర్ కుక్కర్లు

ప్రెషర్ కుక్కర్లు అత్యంత కీలకమైన గృహోపకరణాలు కావడంతో, ప్రజల భద్రత మరియు వినియోగదారుల రక్షణ దృష్ట్యా ఈ ఉత్తర్వు జారీ చేయబడింది. ప్రమాణాలకు అనుగుణంగా లేని లేదా ధృవీకరణ లేని నాసిరకం ఉత్పత్తులు ప్రమాదాలు మరియు గాయాలకు దారి తీయవచ్చు.

ప్రెషర్ కుక్కర్లు భారత ప్రభుత్వం జారీ చేసిన ప్రెషర్ కుక్కర్ (క్వాలిటీ కంట్రోల్) ఆర్డర్, 2020 పరిధిలో ఉన్నాయి. ఈ ఉత్తర్వు ప్రకారం, భారతదేశంలో తయారు చేయబడే, దిగుమతి చేయబడే, విక్రయానికి నిల్వ ఉంచబడే, విక్రయించబడే, పంపిణీ చేయబడే లేదా ప్రదర్శించబడే అన్ని ప్రెషర్ కుక్కర్లు ఐఎస్ 2347:2017 ప్రమాణానికి అనుగుణంగా ఉండాలి మరియు BIS స్టాండర్డ్ మార్క్ (ఐఎస్ఐ మార్క్) కలిగి ఉండాలి. సూరంపల్లి, కృష్ణా జిల్లాలోని ఘనశ్యామ్ అల్యూమినియం వద్ద వివిధ బ్రాండ్లు మరియు సామర్థ్యాలకు చెందిన సుమారు 7,598 నాసిరకమైన ప్రెషర్ కక్కెర్లు BIS లైసెన్స్ లేకుండా మరియు ఐఎస్ఐ మార్కు లేకుండా ఉన్నట్లు గుర్తించబడింది. గణనీయమైన పరిమాణంలో ప్రెషర్ కుక్కర్లు మరియు వాటి భాగాలు స్వాధీనం చేసుకోబడ్డాయి. అదేవిధంగా, విజయవాడ లోని కబేళా ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న రామ్‌దేవ్ ఇండస్ట్రీస్ వద్ద నకిలీ ఐఎస్ఐమార్కు ఉన్న ప్రెషర్ కుక్కర్లు మరియు సంబంధిత భాగాలు గుర్తించి స్వాధీనం చేయబడ్డాయి. ఈ దాడిలో సుమారు 478 ప్రెషర్ కుక్కర్లు, 418 కుక్కర్ బాడీలు మరియు 100 మూతలు స్వాధీనం చేయబడ్డాయి.

BIS చట్టం, 2016 కింద చట్టపరమైన చర్యలు

సంబంధిత యూనిట్లపై BIS చట్టం, 2016 నిబంధనల ఉల్లంఘనల కారణంగా BIS చట్టపరమైన చర్యలు ప్రారంభించింది. ముఖ్యంగా:

(ఉ) BIS చట్టం, 2016 లోని సెక్షన్ 17 ప్రకారం, BIS లైసెన్స్ లేకుండా స్టాండర్డ్ మార్క్ (ఐఎస్ఐ మార్క్) కలిగిన వస్తువులను తయారు చేయడం, నిల్వ ఉంచడం, విక్రయించడం, పంపిణీ చేయడం, దిగుమతి చేయడం లేదా విక్రయ ప్రదర్శన చేయడం నిషేధించబడింది.

(బి) BIS చట్టం, 2016 లోని సెక్షన్ 29(3) ప్రకారం, ఈ నిబంధనల ఉల్లంఘనకు రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష (లేదా) కనీసం 2 లక్షల జరిమానా (లేదా) రెండూ విధించవచ్చు. కొన్ని సందర్భాల్లో, జరిమానా ఉల్లంఘనకు సంబంధించిన వస్తువుల విలువకు పది రెట్ల వరకు జరిమానా విధించబడవచ్చు. BIS ధృవీకరణ గుర్తుల అనధికార వినియోగాన్ని నిరోధించేందుకు మరియు వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు BIS చట్టం కఠినమైన శిక్షలను నిర్దేశించింది.

BIS విజయవాడ అధికారుల ప్రకటన

"ఐఎస్ఐ మార్క్ అనేది నాణ్యత, భద్రత మరియు విశ్వసనీయతకు ప్రతీక. స్టాండర్డ్ మార్క్ దుర్వినియోగం వినియోగదారుల విశ్వాసాన్ని దెబ్బతీయడమే కాకుండా భద్రతా ప్రమాదాలను కూడా సృష్టిస్తుంది. వినియోగదారుల రక్షణకు BIS కట్టుబడి ఉంది. BIS చట్టం, 2016 ను ఉల్లంఘించే తయారీదారులు మరియు వ్యాపారులపై కఠిన చర్యలు కొనసాగుతాయి." ఇలాంటి చర్యల ద్వారా BIS నాణ్యతను ప్రోత్సహించడం, మోసపూరిత వాణిజ్య పద్ధతులను అరికట్టడం మరియు నాసిరకం, ధృవీకరణ లేని ఉత్పత్తుల నుండి వినియోగదారులను రక్షించడం పట్ల తన నిబద్ధతను మరొకసారి చాటుతోంది.

వినియోగదారులకు సూచన

వినియోగదారులు BIS Care App (Android మరియు iOS) ద్వారా ఐఎస్ఐ మార్క్ కలిగిన ఉత్పత్తుల ప్రామాణికతను ధృవీకరించుకోవాలని BIS సూచిస్తోంది. తప్పనిసరి BIS ధృవీకరణ పరిధిలోని ఉత్పత్తులను కొనుగోలు చేసే ముందు లైసెన్స్ వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలి. ఐఎస్ఐ మార్కు, హాల్ మార్కు మరియు సి.ఆర్.ఎస్ మార్క్ నమోదు గుర్తుల దుర్వినియోగాన్ని BIS Care App ద్వారా నివేదించవచ్చు. ఫిర్యాదుల కొరకు: భారతీయ ప్రమాణాల బ్యూరో, విజయవాడ శాఖ కార్యాలయం, 56-2-11, మొదటి అంతస్తు, ఏపీ మార్క్‌ఫెడ్ భవనం, APIIC కాలనీ రోడ్, ఆటోనగర్, విజయవాడ - 520007. ఇ-మెయిల్: hvjbobis@bis.gov.in ఫిర్యాదులు BIS Care మొబైల్ యాప్ ద్వారా కూడా నమోదు చేయవచ్చు. ఫిర్యాదుదారులు మరియు సమాచార దాతల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. BIS ధృవీకరణ పథకాలు, భారతీయ ప్రమాణాలు మరియు వినియోగదారుల సేవల గురించి మరింత సమాచారం కోసం BIS వెబ్‌సైట్ (www.bis.gov.in) ను సందర్శించవచ్చు.

# కేంద్రపథకాల అమలు కమిటీ రాష్ట్ర ఇన్చార్జిగా ముక్కు రాధాకృష్ణ గౌడ్ నియామకం

**నెల్లూరు /విడవలూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు మండలంకు చెందిన సీనియర్ బిజెపి నేత ముక్కు రాధాకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పథకాల అమలు కమిటీ రాష్ట్ర ఇంచార్జిగా నియమించడము జరిగింది. దీంతో పలువురు హర్ష ము వ్యక్తం చేసారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవిని ప్రజలు కొరకు పని చేస్తానని బిజెపి అధిష్టానంకు ముక్కు కృతజ్ఞతలు తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రధానమంత్రి పదవి చేపట్టి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నమ్మకం, అభివృద్ధి, పేదల సంక్షేమం పేరుతో భారతీయ జనతా పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ ఆంధ్ర ప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో భారతీయ జనతా ఓబిసి మోర్చా రాష్ట్ర శాఖ చేయవలసిన కార్యక్రమాలలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కమిటీ రాష్ట్ర ఇన్చార్జిగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణ గౌడ్‌ను ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపి శ్రీనివాస్ నియమించారు. అలాగే ఆయనతోపాటు పల్లి శ్రీనివాసులు నాయుడు, కాలేపు సత్య సాయి, జి.ఆదినారాయణలకు కమిటీలో చోటు కల్పించారు. అలాగే జోనల్ ఇన్చార్జిలను సైతం ప్రకటించడం జరిగింది. ఉత్తరాంధ్ర జోనల్ ఇన్చార్జిగా చిన్నం నాయుడు, గోదావరి జోనల్ ఇన్చార్జిగా అయినం బాలకృష్ణ గౌడ్, కోస్తాంధ్ర జోనల్ ఇన్చార్జిగా తుళ్ళిమిల్లి రామకృష్ణ యాదవ్, రాయలసీమ జోన్ ఇన్చార్జిగా బంగారయ్యలను నియమించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జూన్ నెల 16, 17, 18 న 2026 తేదీలలో చేయవలసిన కార్యక్రమాలు ఆయుష్మాన్ భారత్, ఆయుష్మాన్ వయో వందన పీఎం సూర్యగర్, పీఎం స్వనిధి, లక్‌పతి దీదీ, వివిజి రాంజీ తదితర పథకాలు ప్రజలకు చేరువ చేసేందుకు అన్ని జిల్లాలలో రిజిస్ట్రేషన్ శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నెంబర్ వన్, ఆయుష్మాన్ భారత్, పిఎంజెఏవై జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డిఎంహెచ్వో జిల్లా ఆరోగ్య సమన్వయకర్త ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ నంబర్ 2, ఆయుష్మాన్ వయో వందన 70 ప్లస్ వృద్ధులకు డిఎంహెచ్వో జిల్లా ఆరోగ్య శాఖ, పీఎం సూర్య ఘర్ ముఫ్త్ విద్యుత్ యోజన జిల్లా ఎనర్జీ శాఖ డిస్కం సూపర్డెంట్ ఇంజనీరు, పీఎం స్వనిధి మున్సిపల్ కమిషనర్ డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్, నెంబర్ 5, లక్పత్ దీదీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్, నెంబర్ 6, విబిజి రాంజీ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు జిల్లా కలెక్టర్ మరియు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్లను కలసి సమన్వయం చేసుకుంటూ పై కార్యక్రమాలను రాష్ట్ర ఇన్చార్జిలు, జోనల్ ఇన్చార్జిలు నిత్యం ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పై ప్రోగ్రామ్స్ మండలాల వారీగా, జిల్లాల వారీగా, జోన్ల వారీగా నిర్వహించి పెద్ద ఎత్తున ప్రజలలోకి తీసుకువెళ్లి అట్టడుగు వర్గాల ప్రజలకు పై సంక్షేమ పథకాలు అర్హులందరికీ అదే విధంగా ప్రతి లబ్ధిదారుడు లబ్ధి పొందే విధంగా కార్యాచరణ చేస్తామని తద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టే ప్రయత్నం చేస్తామన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan